# ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు

## అధికార నివేదిక

(మూడవ సమావేశము : ఐదవ రోజు)

---

బుధవారము, 26 సెప్టెంబరు 1990

---

(సభ ఉదయం 8.30 గంటలకు సమావేశమైనది)

(ఉపసభాపతి అధ్యక్షస్థానంలో ఉన్నారు)

## సభాకార్యక్రమము

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- క్వశ్చన్ నెం. 1949 తీసుకుందాము.

(తెలుగుదేశం పార్టీ గౌ॥ సభ్యులందరూ లేచి నిలబడిరి)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- ఒక్కొక్కరూ మాట్లాడండి, మీకు అవకాశం ఇస్తాను.

శ్రీ టి. పురుషోత్తం రావు (వరంగల్) :- అధ్యక్షా ..

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- ఇది క్వశ్చన్ అవర్ అయినప్పటికీ నేను మీకు అవకాశం ఇస్తాను.

శ్రీ టి. పురుషోత్తమ రావు :- అధ్యక్షా, రాత్రి న్యూ ఎమ్ ఎల్ ఏ క్వార్టర్సులో ఇద్దరు కాంగ్రెస్-ఐ శాసనసభ్యులను - శ్రీ రాంబాబు, నర్సిరెడ్డిగార్లను అసాధారణంగా, మర్మార్గంగా కొట్టినటువంటి సంఘటన ఇది. నిజంగా ప్రజాస్వామ్యంలో మన శాసనసభలోనే ఒక అసాధారణమైన చర్య. తెలుగుదేశం పార్టీవారు కేవలం కక్షతో, చాలా దురుద్దేశంతో చేసినటువంటి సంఘటన ఇది. మేమందరం దీనిని ఖండిస్తున్నాం. ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన అని మనవి చేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- శ్రీ పురుషోత్తమ రావు గారూ - ఇది క్వశ్చన్ అవర్. ఇది మీరు జీరో అవర్‌లో రెయిజ్ చేయవచ్చు. ఇప్పుడు కాదు.

(ఇంటరప్షన్స్)

అటువంటి సంఘటన ఉంటే మీరు జీరో అవర్‌లో రెయిజ్ చేయండి, ఇప్పుడు కాదు. ఇది క్వశ్చన్ అవర్, దయచేసి కూర్చోండి, జీరో అవర్‌లో అవకాశం ఇస్తాను.

శ్రీ బి. వెంకటేశ్వరరావు (మధిర) :- అధ్యక్షా, పాయింట్ ఆఫ్ ఆర్డరు. రూల్ 300

ప్రకారం నిన్న మీరు చేసినటువంటి సస్పెన్షను చెల్లనేరనదని మనవి చేయదలచుకున్నాను. రూలు 300 చూడండి. ఏ సభ్యుడిని పేరు చెప్పకుండా మీరు మూకుమ్మడిగా సస్పెన్షను చేసినది చెల్లనేరదు, ఇది సరైన పద్ధతి కాదు, ఇల్లీగల్ అని మీకు మనవి చేస్తున్నాను. మన ఆంధ్రప్రదేశ్ శాసనసభ చరిత్రలోనే ఈ రకంగా 54 మందిని మూకుమ్మడిగా సస్పెన్షన్ చేసిన పరిస్థితి చాలా విచారకరమైనది. ఇది దారుణమైన విషయం. నేను నిన్న పదేపదే శాసనసభలో విజ్ఞప్తి చేసాము.

(ఇంటరప్షన్స్)

వ్యవసాయశాఖమంత్రి (శ్రీ డి.కె. సమరసింహారెడ్డి) - మా సభ్యులను జీరో అవర్ అన్నారు.

శ్రీ బి. వేంకటేశ్వర రావు :- వారు వ్యవహరిస్తున్నటువంటి తీరే - అధికారపక్షం ఏ మాత్రం సహనంతో వ్యవహరించకుండా అసహనంతో ప్రతిపక్షాల వారు నోరు నొక్కేయదలచుకున్నదా అని ప్రశ్నిస్తున్నాను. నిన్న జరిగినటువంటి ఘటనలో మానసికంగా వారి పార్టీ నాయకుడిని గాయపరచే చర్యలు ఉన్నాయి. ఈ మంత్రులందరూ చెబుతూ ఉంటారు. ఎవరైనా కన్‌సరండు మంత్రి లేకపోతే సమిష్టి బాధ్యత అని చెబుతారు.

శ్రీ కె. రోశయ్య :- అధ్యక్షా, పాయింట్ ఆఫ్ క్లారిఫికేషన్.

(ఇంటరప్షన్స్)

శ్రీ బి. వెంకటేశ్వరరావు :- ఏ పరిస్థితిలలోను ఈ రకమైనటువంటి చర్య తీసుకోవడం మంచిది కాదు. ఈ సస్పెన్షను రద్దు చేయాలని తమ ద్వారా నేను మనవి చేస్తున్నాను.

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- శ్రీ వెంకటేశ్వర రావు గారూ - మీరు రూలు - 300 కోట్ చేసారు. ఇది క్వశ్చన్ అవర్, పాయింటు ఆఫ్ ఆర్డర్స్ రెయిజ్ చేయడం ఇప్పుడు కాదు, క్వశ్చన్ అవర్ అయిన తరువాత రెయిజ్ చేయాలి.

(ఇంటరప్షన్స్)

శ్రీ వెంకటేశ్వరరావు గారూ - ఏమైనా నిన్న తీసుకున్న చర్య రూలు 300 క్రింద పెర్ఫెక్టలీ వాలిడ్. There is no irregularity or illegality in it.

(ఇంటరప్షన్స్)

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి :- అధ్యక్షా, ఇటువైపు నుంచి గౌరవసభ్యులు ఒక అంశం లేవనెత్తితే తాము ఎలా చేయను, జీరో అవర్‌లోనే ఎలా చేస్తాను అని చెప్పారు. మా సభ్యులు మీ మాట ప్రకారం కట్టుబడి కూర్చున్నారు. అదే పద్ధతి మిగిలిన సభ్యులకు కూడా అన్వయింప చేయండి. ఇది తమకు మా ప్రార్థన. లేదంటే ఇది పద్ధతి కాదు. జీరో అవర్‌లో లేవనెత్తవలసిన అంశాలను క్వశ్చన్ అవర్‌లో లేవనెత్తడానికి వీలులేదు. అసలు ఎటువంటి అసాధారణ పరిస్థితి లేదు.

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- ఏమైనా సందేహాలు ఉన్నా, ఏ సమస్య ఉన్నా క్వశ్చన్ అవర్ అయిన తరువాత జీరో అవర్‌లో రెయిజ్ చేద్దురు గాని. క్వశ్చన్ అవర్ ప్రొసీడ్ కానీయండి.

శ్రీ బి. వెంకటేశ్వరరావు :- అధ్యక్షా ...

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- మీరు చెప్పారు, అయిపోయింది.

శ్రీ బి. వెంకటేశ్వరరావు :- అది కరెక్టు అని అంటున్నారు. నేను కాదని అన్నాను. మీరు దాని మీద రూలింగు ఇవ్వండి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- శ్రీ వెంకటేశ్వరరావు గారూ - మీరు చెప్పారు. ఇక అయిపోయింది, కూర్చోండి.

(ఇంటరప్షన్స్)

శ్రీ నాగేశ్వరరావు గారూ - సభా కార్యక్రమం నడపడానికి మీరు ఏమైనా సలహా చెబితే చెప్పండి.

శ్రీ బి. వెంకటేశ్వరరావు :- అధ్యక్షా ..

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- ఇది క్వశ్చన్ అవర్ అండి. మీ సమస్యలన్నీ జీరో అవర్‌లో రెయిజ్ చేద్దురుగాని.

(ఇంటరప్షన్స్)

శ్రీ కె. శివప్రసాదరావు (నర్సరావుపేట) :- అధ్యక్షా ....

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- శ్రీ శివప్రసాదరావు గారూ - మీరు ఆ విషయం జీరో అవర్‌లో రెయిజ్ చేయండి, నేను తప్పకుండా మీకు అవకాశం ఇస్తాను. ఇప్పుడు కాదు. It is only question hour.

శ్రీ బి. వెంకటేశ్వరరావు :- అధ్యక్షా, ఒకే ఒక నిమిషం.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- ఇప్పుడు కాదు. ఈ రోజు కూడా క్వశ్చన్ అవర్ చెడగొట్టబోకండి.

8.40 ఉ. **Minister for Legislative Affairs (Sri K. Bapi Raju)** :- Sir, you have just mentioned 'it is only question hour'. It is 'question hour' not 'only question hour'.

(All the opposition Members were on their legs)

**Mr. Dy. Speaker** :- I request you all. Please resume your seats. దయచేసి సభ్యులు రూలు 38 ఒకసారి చూడాలని రిక్వెస్టు చేస్తున్నాను. రూలు 38 ప్రకారం సభలో ఉన్న సభ్యులందరికీ క్వశ్చన్ అవర్‌ను ఉపయోగించుకునే అవకాశం ఉంది, హక్కు ఉంది. It is the prerogative of every Member to use Rule 38 and that prerogative cannot be infringed by some people by causing interruptions.

(ఇంటరప్షన్స్)

శ్రీ ఎమ్. ఓంకార్ (నరసంపేట) :- అధ్యక్షా, పాయింటు ఆఫ్ ఆర్డరు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- జీరో అవర్‌లో మీకు కావలసినంత అవకాశం ఇస్తాను. చెప్పేది వినే - హరికథలతోనే మనం ప్రతిరోజు సమయం అంతా వ్యర్థం చేస్తున్నాము. Let us go to the question hour. ఇప్పుడు క్వశ్చన్ నంబరు 1949 తీసుకుందాము.

(ఇంటరప్షన్స్)

(ఈ ఇంటరప్షన్స్ మధ్యలో రోడ్లు, భవనాల శాఖమంత్రి శ్రీ జె.సి. దివాకరరెడ్డిగారు ప్రశ్న నంబరు 1949కు సమాధానం చదివిరి)

## ప్రశ్నలు - వాగ్రూప సమాధానములు*

### తుంగభద్రపై వంతెన

58-

*1949-సర్వశ్రీ ఆర్. రామయ్య (ఆదోని), మరియు కె.రాంభూపాల్ రెడ్డి (పాణ్యం) :- రోడ్లు భవనాల శాఖమంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :-

(అ) కర్నూలు జిల్లాలోని నాగలదేవి వద్ద తుంగభద్రా నదిపై వంతెన నిర్మించే ప్రతిపాదన ఏమైనా వున్నదా :

(ఆ) అయినచో. దానిని ఎప్పుడు చేపడతారు?

రోడ్లు , భవనాల శాఖమంత్రి (శ్రీ జె.సి. దివాకరరెడ్డి) :- (అ) అవునండీ.

(ఆ) పై వంతెన పనికి సంబంధించిన సవివరమైన అంచనా డిజైన్లకు, డ్రాయింగులకు భారత ప్రభుత్వము ఉపరితలరవాణాశాఖ నుండి ఆమోదం అందిన మీదట దీనిని చేపట్టడం జరుగుతుంది.

## సభాకార్యక్రమము

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- సభ సమావేశం కావడంతోనే క్వశ్చన్ అవర్ తీసుకోవలసిన అవసరం ఉంది. It is a mandatory provision. Let us follow that provision. Thereafter, we can ....

(ఇంటరప్షన్స్)

---

* మిగతా ప్రశ్నలు - సమాధానముల కొరకు అనుబంధము చూడనగును.

(ఉపసభాపతి ఉత్తర్వు - సి.వెం.471/క్వశ్చన్/90)

శ్రీ ఎమ్. ఓంకార్ :- అధ్యక్షా, పాయింట్ ఆఫ్ ఆర్డరు

శ్రీ జె.సి. దివాకరరెడ్డి :- అధ్యక్షా, మాకు అర్థం కావడం లేదు. ఈ పెద్ద మనుషులందరూ గతంలో ఎక్కడికిపోయారు? ఇదే అసెంబ్లిలో ఉన్నారు కదా? ఆ రోజు ఇదంతా ఆలోచన చేయలేదా? ఈ రోజు ఏమి అవసరం వచ్చిందని ఇదంతా చెస్తున్నారు. ఇదివరకు నిర్దాక్షణ్యంగా బైటకు ఈడ్చివేసినప్పుడు ఇదంతా వారు ఆలొచన చేయలెదు

శ్రీ ఎమ్. ఓంకార్ :- అధ్యక్షా, నాకు అవకాశం ఇవ్వండి.

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- క్వశ్చన్ అవర్‌లో ఇంకొకటి వినడానికి లెదు, ఇది అందరికి తెలుసు. ఇది క్వశ్చన్ అవర్. In this manner every day we are losing the questions. క్వశ్చన్ అవర్ అందరి హక్కు. ఆ హక్కును భగ్నం చేయకూడదండి. క్వశ్చన్ అవర్ అయిన తరువాత మీకు అవకాశం ఇస్తాను.

**Sri D.K. Samarasimha Reddy** :- Sir, Rule 38 is very clear. Unless otherwise you direct, the first hour shall be the question hour. It is clearly enunciated. We have to proceed with the question hour only. Later, in the zero hour, whatever is relevant that can be raised, but not during the question hour.

(ఇంటరప్షన్స్)

శ్రీ జె.సి. దివాకరరెడ్డి :- అధ్యక్షా, ఈ వేళ మీరు ఇది ఎలా చేస్తే రేపటి నుంచి మా సభ్యులు క్వశ్చన్ అవర్‌లోనే రెయిజు చేయడం జరుగుతుంది. ఈ విధంగా వారు ప్రస్తావించవలసిన విషయాలన్నీ క్వశ్చన్ అవర్‌లో రెయిజ్ చేస్తారు. అప్పుడు మీరు పర్మిషన్ ఇస్తారా? మీరు ఆ రకంగా పర్మిషను ఇస్తే మాకు ఎటువంటి అభ్యంతరం లేదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- వారికి యాజిటేటెడ్ ఇష్యూస్ ఉన్నాయి. వారు అటు సైడ్ నుంచి రెయిజ్ చేయబోతే ఇప్పుడు కాదు జీరో అవర్‌లో అని నేను లేవనీయలేదు. అలాగె మీకు కూడా యాజిటేటెడ్ ఇష్యూస్ ఉన్నాయి. అవి జీరో అవర్‌లొ విందాము. ఇప్పుడు కనీసం క్వశ్చన్ అవర్ అయినా చేద్దాము. క్వశ్చన్ అవర్ మాండేటరీ. ఇప్పుడు ఆ విషయాలు మొదలుపెడితే క్వశ్చన్ అవర్‌లేకుండా పోతుంది. క్వశ్చన్ అవర్ అయిన తరువాత ఈ విషయాలు మొదలుపెడదాము. జీరో అవర్‌లో అన్ని పార్టీలకు అవకాశం ఇస్తాను క్వశ్చన్ అవర్ జరగనీయండి, ఇది మాండేటరీ ప్రొవిజను. ఇది సభ్యులందరి యొక్క హక్కు దయచేసి కూర్చోండి.

(ఇంటరప్షన్స్)

శ్రీ జె.సి దివాకరరెడ్డి :- శ్రీ ఓంకార్ గారు ప్రతిరోజు అసెంబ్లీలో ప్రవచనాలు చెబుతారు. రూల్సుకు విరుద్ధంగా క్వశ్చన్ అవర్‌లో ఎందుకు ఈ సమస్యను లేవనెత్తుతున్నారు? ఇదివరకు సమస్యలు అటువైపు లేవా? ఇదేమిటి? మాకు అర్థం కాదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- శ్రీ కె. రాంభూపాల్ రెడ్డి గారూ - మీరు సప్లిమెంటరీ అడుగుతారా?

(ఇంటరప్షన్స్)

శ్రీ కె. శివప్రసాదరావు :- అధ్యక్షా, ఇటువైపు సభ్యులు లేరు. వారు లేకుండా సభ నడపడం గౌరవం కాదు, సాంప్రదాయం కాదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- క్వశ్చన్ అవర్ అయిన తరువాత అన్నీ డిస్కస్ చేద్దాము.

శ్రీ ఎమ్. ఓంకార్ :- అధ్యక్షా, పాయింట్ ఆఫ్ ఆర్డర్ ....

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- శ్రీ కె. రాంభూపాల్‌రెడ్డి గారు, శ్రీ ఆర్. రామయ్య గారు - మీరు సప్లిమెంటరీ ఏమైనా అడుగుతారా లేదా?

శ్రీ ఆర్. రామయ్య :- అధ్యక్షా, 1984లో అప్పటి కేంద్ర మంత్రులు శ్రీ కె. విజయభాస్కర రెడ్డి గారు మంజూరు చేసారు. కాని 6 సంవత్సరాలు అయినా ఇది ఆలస్యం కావడానికి కారణం ఏమిటి? దీనివల్ల కర్నాటకలోని ముఖ్య ప్రదేశాలకు హైదరాబాద్‌కు దారి 60, 70 కిలో మీటర్లు తగ్గుతుందనే కారణం వాస్తవమా? దీనిని ఎప్పటికి పూర్తిచేస్తారు.

(ఇంటరప్షన్స్)

8.50 ఉ. శ్రీ జె.సి. దివాకరరెడ్డి :- 1984 సంవత్సరములో ఈ వంతెన పని కార్యక్రమాన్ని చేపట్టాలని ...

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- జీరో అవర్‌లో మీకు అవకాశము ఇస్తాను. దయచేసి మీరందరూ కూర్చోండి. క్వశ్చన్ అవర్ కానివ్వండి.

(ఇంటరప్షన్స్)

శ్రీ జె.సి. దివాకరరెడ్డి :- ఈ వంతెన కార్యక్రమాన్ని 1984లోనే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వము నుండి ఉత్తర్వు వచ్చింది. దానిపైన ఇక్కడున్నటువంటి ఇంజినీర్స్ ఎస్టిమేట్ తయారు చేయడం, అక్కడకు పంపడం జరిగింది. దాని ఖరీదు రూ. 255.70 లక్షల రూపాయలు. 50 శాతం వుంటుంది. ఈ మధ్యనే ఎస్టిమేట్స్ పంపించాము.

(ఇంటరప్షన్స్)

(కాంగ్రెస్ గౌ॥ సభ్యులు మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని కేకలు వేస్తూ అందరూ డెప్యూటీ స్పీకర్ గారి పోడియం దగ్గరకు వచ్చి అడ్డు తగిలారు)

**Mr. Dy. Speaker** :- The House is adjourned for half-an-hour.

(The House then adjourned at 8.51 A.M.)

సభ తిరిగి ఉదయం 9.44 గంటలకు సమావేశమైనది

(ఉపసభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

## శాసనసభ్యుడు శ్రీ అంబటి రాంబాబుపై దాడి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- అన్ని పార్టీల ప్రతినిధులతో మాట్లాడిన తరువాత ఈ రోజు జరపవలసిన కార్యక్రమాల గురించి ఒక అవగాహనకు వచ్చాము. దాని ప్రకారము ప్రొసీడ్ అవుదాము. దయచేసి అంతా పీస్‌ఫుల్‌గా ఉండాల్సిందిగా మనవి చేస్తూ ఇప్పుడు అంబటి రాంబాబు గారు ఆయన మీద ఏదో ఎటాక్ జరిగిందని చెప్పారు. దాని గురించి వివరించవలసిందిగా వారిని కోరుతున్నాను.

శ్రీ అంబటి రాంబాబు (రేపల్లె) :- అధ్యక్షా, నిన్న రాత్రి సుమారు 10-30 గంటల ప్రాంతములో నన్ను , నాతోటి శాసనసభ్యులు నర్సిరెడ్డిగారు, జయరాంబాబు గార్లను నాన్-వెజిటేరియన్ కాంటీన్‌లో మా డిన్నరు కంప్లీటు చేసుకుని బయటకు వస్తున్న తరుణంలో కొందరు వ్యక్తులు నా మీద దాడి చేసి నన్ను వాళ్ల ఇష్టము వచ్చినట్లుగా విచ్చలవిడిగా కొట్టడం జరిగింది. ఆ విషయాన్ని సభ ముందు ఉంచడానికి వివరించడానికి నాకు అవకాశం ఇచ్చిన మీకు నా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. అధ్యక్షా, నన్ను కొట్టారని, నాకు దెబ్బలు తగిలాయని నేను బాధపడడం లేదు. అయితే నన్ను కొట్టిన ప్లేసు, నా హోదా, నా పరువు నన్ను చాల బాధిస్తున్నాయి. నన్ను ఏ బజారులోనే కొట్టితే వేరే విషయం. నన్ను ఎం.ఎల్.ఏ కాకుండా ఉంటే కొడితే అది వేరే విషయం. శాసనసభ జరుగుతున్నప్పుడు ఎం.ఎల్.ఏ క్వార్టర్సులో ఎం.ఎల్.ఏలు ఉండే రెసిడెన్సులో కాంటీన్ నుంచి వస్తూ ఉన్నప్పుడు వ్యక్తులు నా మీద దాడి చేసి కొట్టడం చాల ప్రమాదకరమైన పరిణామం. ఇది ఈ వేళ నాకు జరగవచ్చు. రేపు మరొకరికి జరగవచ్చు. ఇది సభ అంతా పార్టీ ప్రమేయం లేకుండా అందరూ కూడ చాల సీరియస్‌గా తీసుకోవలసిన విషయం అని నేను భావిస్తున్నాను. అయితే నేను అదృష్టవశాత్తు అక్కడ నుంచి పారిపోయి రూం. నంబరు 45లో దాక్కోవడం జరిగింది, గాని లేకపోతే నా ప్రాణానికే ప్రమాదం జరిగి ఉండేది అని చెప్పి సభకు నేను మనవి చేస్తున్నాను. అయితే నన్ను ఈ విధంగా కొట్టడానికి, నన్ను ఈ విధంగా బాధించడానికి గల కారణాలు కూడ నాకు తెలిసినంతవరకు సభ ముందు ఉంచాలి. ముఖ్యంగా నన్ను కొట్టడానికి ప్రధానమైన కారణం కాంగ్రెస్ శాసనసభ్యుడిని అవడమేమో అని నేను బాధపడుతూ ఉన్నాను. శాసనసభలో మిత్రులు తెలుగుదేశం పక్షం వారు విమర్శిస్తూ వాటికి కౌంటరుగా యువకులమైన మేము ఎదురు విమర్శలు చేయడం వారి ఎటాక్‌ని తట్టుకోవడం కోసం ప్రయత్నం చేయడం జరిగింది. మరీ ముఖ్యంగా నిన్న శాసనసభ నుంచి తెలుగుదేశం సభ్యులను సభ బహిష్కరించింది, సస్పెండు చేసింది. వారిని మార్షల్స్ చేత బయటికి పంపించడం కూడా జరిగింది. ఆ తరువాత తెలుగుదేశం శాసనసభ్యులందరు కారిడార్‌లో కూర్చుని ధర్నా చేస్తూ ఉన్నారు. ఆ ధర్నా చేస్తూ కాంగ్రెస్ గూండాయిజం నశించాలి, లంచగొండి ప్రభుత్వం నశించాలి అని చెన్నారెడ్డి డౌన్ డౌన్ అని ఇంకా వారికి నచ్చిన నినాదాలు చేస్తూ ఉన్నారు. ఆ నినాదాలు మిత్రులు జయరాంబాబు గారు మేము విన్నాము. ఒక గంట జరిగిన తరువాత వాళ్లు ఆ విధంగా నినాదాలు ఇస్తూ ఉంటే మాకు కూడ ఎమోషన్ వచ్చి నేను. జయంరాంబాబు గారు రాజీవ్‌గాంధి నాయకత్వం వర్ధిల్లాలి అని తెలుగుదేశం పార్టీ అరాచకం

నశించాలి అని నినాదాలు చేశాము. మా నినాదాలు చూసి మా పార్టీ సభ్యులందరు కూడ మా చుట్టూ చేరడం జరిగింది. చేరినప్పుడు సహజంగా నేను యువ శాసనసభ్యుడిని అవడంతో చాలా ఉత్సాహంగా అందరిని ఎంకరెజ్ చేస్తూ వాళ్లకి కౌంటర్ స్లొగన్స్ ఇవ్వడం జరిగింది. ఆ కౌంటర్ స్లొగన్స్ ఇచ్చిన తరువాత పెద్దలు రఘుమారెడ్డి గారు ఇంకా కొంతమంది వచ్చి మేము ఏదో పాలసీ మేటరుగా చేసుకుంటూ ఉన్నాము మేము స్లొగన్సు ఇస్తూ ఉన్నాము. మీరు కూడ స్లొగన్సు ఇస్తే బాగోదు ఘర్షణలకు తావు అవుతుంది అని మాకు చెబితే మేమే అంతటితో నిష్క్రమించి కేవలం ప్రొటెస్టు చెప్పి బయటికి వెళ్లిపోవడం జరిగింది. ఆ నినాదాలలో 'అమరజీవి
9.50 రంగాకి జోహార్' అని అనడం జరిగింది. ఆ తరువాత అదే రోజు రాత్రి 10.30
ఉ. గంటలకు నా మీద ప్రత్యేకంగా దాడి జరగడంలో, అదియును కాక కంకిపాడు శాసనసభ్యుడు దేవినేని నెహ్రూ అనుచరులతో దాడి జరిగితే ఎవరైనా విజ్ఞులు కానివ్వండి, పెద్దలు కానివ్వండి

(ఇంటరప్షన్స్)

(ఈ సమయములో కొందరు తెలుగుదేశం గౌరవ సభ్యులు, కాంగ్రెస్-ఐ గౌరవ సభ్యులు పోడియం దగ్గరకు చొచ్చుకొని వచ్చారు.)

**Mr. Dy. Speaker** :- All Members, please resume your seats. I request all Members to resume your seats. Please don't get exited. Order please, Order please.

శ్రీ అంబటి రాంబాబు :- అధ్యక్షా ...

**Mr. Dy. Speaker** :- Mr. Narsi Reddy, please resume your seat. ఇంద్రారెడ్డి గారు, గోపాలకృష్ణారెడ్డి గారు దయచేసి కూర్చోండి. వారిని చెప్పనివ్వండి.

శ్రీ అంబటి రాంబాబు :- అధ్యక్షా, దయచేసి నాకు అవకాశం ఇచ్చారు, నన్ను చెప్పుకోనివ్వండి.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- అధ్యక్షా ..

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- శివప్రసాదరావు గారు తరువాత మీరే కదా మాట్లాడవలసింది. వారి తరువాత మాట్లాడుదురు గాని.

శ్రీ అంబటి రాంబాబు :- అధ్యక్షా, నేను ఇక్కడ ఆరోపించడం కాదు. ఈ విషయం రాత్రి 10.30 గంటలకు జరిగింది. జరిగిన వెంటనే నేను ఏదో వారు తెలుగుదేశం వారనే ఉద్దేశముతో, నేను కాంగ్రెస్ వాడిననే ఉద్దేశంతొ నాకు దెబ్బలు తగిలిన ఆవేదనతో వారిని బేడ్ ఇన్‌టెన్షన్‌తో ఇరికించాలనే ఉద్దేశముతో చేసినది కాదు. రాత్రి 11 గంటలకు నేను రిటెన్‌గా కంప్లయింట్ చేయడం జరిగింది. ఆ ఎఫ్.ఐ.ఆర్‌లో ఉన్న దానినే చెపుతున్నాను కాని తోటి శాసనసభ్యుల మీద అబద్ధపు ఆరోపణలు చేయాలనేటటువంటి నీచమైన ఉద్దేశం నాకు లేదని సభకు మనవి చేస్తున్నాను.

(అధికారపక్షం గౌ. సభ్యులు చప్పట్లు చరిచారు)

ఆ వచ్చిన కుర్రవాళ్ళు అందరూ కూడా దేవినేని నెహ్రూ క్వార్టర్‌లోంచి తప్పతాగి వచ్చి దాడి చేశారని ఆవేదనతో నేను సభ ముందు ఉంచుతున్నాను.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- అధ్యక్షా....

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- రాంబాబు గారు. మీ మీద దారుణంగా దాడి జరిగింది మీరు బాధపడ్డారు. మీరే కాదు సభ అంతా బాధపడింది. నేను కూడా బాధపడుతున్నాను

(ఇంటరప్షన్స్)

శ్రీ అంబటి రాంబాబు :- అధ్యక్షా, నేను శాసనసభలో ఒక గౌరవ సభ్యుడిని. బయటకు వెళ్లి ....

(ఇంటరప్షన్స్)

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి :- అధ్యక్షా, పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఇప్పుడు సభలో నిన్న సస్పెండ్ కాబడిన ఇద్దరు సభ్యులు ఉన్నారు. వాస్తవానికి ఏమటుకు గౌరవమర్యాదలు ఉన్నా. రూల్స్ పట్ల అభిమానం, వారికి వాటిని గౌరవించాలన్న ఉద్దేశం ఉన్నా సభలోనికి రాకుండా ఉండవలసింది. కాని ఇద్దరు తెలుగుదేశం సభ్యులు, నిన్న సస్పెండ్ కాబడిన సభ్యులు ఈ రోజు సభలోకి వచ్చి కూర్చున్నారు.

(ఇంటరప్షన్స్)

అధ్యక్షా, వారు కాని తమంతట తాము మేము సస్పెండ్ కాలేదు. మేము లేమని చెప్పితే మాకు అభ్యంతరం లేదు. నిజంగా ఉండి ఉంటే They must immediately vacate the House. They have no business to be present here.

**Sri P. Nageswara Rao** (Khammam) :- Who are they?

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి :- అధ్యక్షా, అర్హత లేని, అనుమతి లేని వ్యక్తులు ఇక్కడ సభలో ఉండడానికి అనుమతి లేదు. ఒకవేళ ఆ సభ్యులు నిన్న మేము లేమని చెబితే మాకు అభ్యంతరం లేదు.

(ఇంటరప్షన్స్)

(కొందరు తెలుగుదేశం గౌ॥ సభ్యులు ఆ సభ్యుల పేర్లు చెప్పాలన్నారు)

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి :- నిన్న ఎవరెవరు ఉన్నారో ఆ నేమ్స్ ఇక్కడ రికార్డు కాబడ్డాయి. మీరు చెక్ చేయండి. ఇద్దరు సభ్యులు నిన్న హాజరయి ఉన్నట్లుగా ఉంది. దాని ప్రకారం వారు ఈ సభలో ఉండడానిక వారికి అర్హత లేదు. till the suspension is revoked

**Minister for Animal Husbandary (Sri Nallapareddy Srinivasulau Reddy)** :- Sir. I am on a point of order. Kindly hear me. The assault

the Hon'ble Member Mr. Rambabu is an assault on democracy. It is an assault on Parliamentary democracy. It is an assault in the precincts of the House. ఎందువల్ల నంటే నేను మనవి చేస్తున్నాను. Hostel precints are declared, as the precints of the Assembly, by your predecessor. నేను ఆ అసెంబ్లీ హాస్టల్ ప్రాంగణములో సత్యాగ్రహం చేస్తే అదే స్పీకర్, అదే డెప్యూటీ స్పీకర్ ఆనాడు నన్ను పోలీసు వారి చేత ఎత్తించుకొని బయట పాడేశారు. I was arrested in the precincts of the hostel because that was treated as the precincts of the House.

**Sri B. Gopala Krishna Reddy (Srikalahasti) :-** There is no point of order. Under which Rule, are you making this statement?

**Sri Nallapareddy Srinivasulu Reddy :-** I am still continuing my point of order. Kindly refer Rule 2 (1) (2) (0). ఎప్పుడైనా స్పీకర్‌గారు లేదా స్పీకర్‌గారు
10.00 లేనప్పుడు డిప్యూటీ స్పీకర్ గారు ఏదైన ఇతర చోట్లను కూడా ప్రిస్టింక్స్ ఆఫ్‌ది హౌజ్‌గా
ఉ. డిక్లేర్ చేయవచ్చు. ఆనాడు స్పీకర్‌గారు లేకపోతే డిప్యూటీ స్పీకర్‌గారు దానిని ప్రిసింక్ట్స్ ఆఫ్‌ది హౌజ్ గా డిక్లేర్ చేశారు. ఇప్పటికీ అది ప్రిసింక్ట్స్ ఆఫ్ ది హౌజ్ గానే కంటిన్యూ అవుతున్నది. అక్కడ ఈ సంఘటన జరిగింది అంటే అది ప్రిసింక్ట్స్ ఆఫ్ ది హౌజ్‌లో జరిగినట్లుగా భావించాలి. ఈనాడు మీరు గాని, ఈ హౌజ్‌గాని వారిని పనిష్ చేయడానికి అధికారం వుంది. Becuase the crime has occured in the precincts of the House. This august House has got every right to punish the people who are guilty. Your honour, my honour and the honour of the house are involved in the incident. It is an assualt on democracy and on Parliamentary democracy.

(అధికార పక్షం సభ్యుల నుండి చప్పట్లు)

ఇది మిమ్ములను కొట్టినట్లు, నన్ను కొట్టినట్లు, ఇక్కడ వున్న ప్రతి ఒక్క వ్యక్తిని కొట్టినట్లుగా భావించాలని మనవి చేస్తున్నాను. ఇది ఇంకా కొనసాగితే మాకు రక్షణ ఎక్కడ వుంది? ఈ రోజు ఒక ఎం.ఎల్.ఏను కొట్టారు, రేపు నన్ను కొట్టవచ్చు, మీకు జరగవచ్చు, ఇంకెవరినైనా కొట్టవచ్చు. ఇది రంగా ఆత్మ శాంతి మీద కొట్టిన దెబ్బగా నేను భావిస్తున్నాను. స్వర్గంలో వున్న రంగా గారిని ఇంకా హింసిస్తున్నట్లుగా కూడా భావిస్తున్నాను.

(తెలుగుదేశం గా॥ సభ్యుల నుండి అంతరాయము)

శ్రీ సిహెచ్. విద్యాసాగరరావు (మెట్‌పల్లి) :- ఇందులో పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటి?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- శ్రీనివాసులరెడ్డిగారు, రెయిజ్ చేసి పాయింట్ ఆఫ్ ఆర్డర్‌లో వారు అసెంబ్లీ హాస్టల్‌ను కూడా ప్రిసింక్ట్స్ ఆఫ్ ది హౌజ్‌గా డిక్లేర్ చేయాలని కోరారు. The Hon'ble Speaker, from time to time, has declared that it can be treated as the precincts of the House. క్రిందటి టర్మ్‌లో వారు అట్లా స్పెసిఫై చేసి ట్రీట్‌చేశారు. మనం 9వ అసెంబ్లీలో వున్నాం. ఇప్పటివరకూ వారు అట్లా స్పెసిఫై చేసి ప్రిసింక్ట్స్ ఆఫ్ ది హౌజ్‌గా డిక్లేర్

చేసినట్టు మనకు ఆధారాలు లేవు. అలా డిక్లేర్ చేయకముందు ఈ సంఘటన జరిగింది కాబట్టి దానిని ప్రిసింక్ట్స్ ఆఫ్ ది హౌజ్‌లో జరిగినట్టు భావించడం సాధ్యం కాదని శ్రీనివాసుల రెడ్డి గారికి మనవి చేస్తున్నాను. That matter will be dealt with by the regular police. Because you are all agitated, we will support the action.

(ప్రతిపక్ష సభ్యుల నుండి అంతరాయము)

రాంబాబు గారు ఇంకా పూర్తి చేయలేదు. వారిని మాట్లాడనివ్వండి.

శ్రీ సిహెచ్. విద్యాసాగర్‌రావు :- పాయింట్ ఆఫ్ ఆర్డర్.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- మీ పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటి?

శ్రీ సిహెచ్. విద్యాసాగర్‌రావు :- నా పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటంటే రాంబాబు గారు మాట్లాడేంత వరకు మీరు ఎవరికీ అవకాశం ఇవ్వకూడదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- రాంబాబు గారూ, మీ ఆవేదన, మీ బాధ నాకు తెలుసు. కాని సాధ్యమైనంతవరకు అన్‌ప్రొవోకబుల్ లాంగ్వేజ్‌ను వాడుతూ మీ బాధను చెప్పండి.

శ్రీ అంబటి రాంబాబు :- అధ్యక్షా, శాసనసభ్యులందరూ కూడా - మా పార్టీ సభ్యులేకాకుండా బి.జె.పి వారు అవుతేనేమి, సి.పి.ఐ., సి.పి.ఎం.వారు అవుతేనేమి, జనతాదళ్ వారు అవుతేనేమి, తెలుగుదేశంలోని ప్రజాస్వామ్యవాదులైతేనేమి - ఎవరైనా సరే దీనిని సహృదయంతో ఆలోచించాలని సవినయంగా మనవి చేస్తున్నాను. నేను ఇంతకు ముందే చెప్పాను. నాకు తగిలిన దెబ్బలు గురించి నేను కించిత్ బాధపడడం లేదు. జరిగిన స్థలాన్నీ, జరిగిన వ్యక్తియొక్క హోదా గురించే నేను బాధపడుతున్నాను. ఈ రోజు నాకు ఇలా జరిగిందంటే రేపు రేపు కాంగ్రెస్ సభ్యులలో ఒకరికో, బి.జె.పి., సి.పి.ఐ తదితర పార్టీల సభ్యులలో ఎవరికైనా జరగవచ్చు. చివరకు తెలుగుదేశం సభ్యులలోనే మరొకరికి జరగవచ్చు. కాబట్టి ఇది సభ మొత్తం వుమ్మడిగా ఆలోచించవలసిన విషయమని నేను ప్రత్యేకంగా మనవి చేస్తున్నాను. నేను సభ ముందు వాస్తవాలను ఉంచుతున్నప్పుడు ఎవరైనా వ్యక్తులకు గుచ్చుకొంటే నన్ను క్షమించాలి. ఎవరికీ గుచ్చుకోవాలనే ఉద్దేశంతో నేను చెప్పడం లేదు. వాస్తవాలు చెప్పే క్రమంలో గుచ్చుకొంటే నేను చేయగలిగింది ఏమీ లేదని తమకు మనవి చేస్తున్నాను. అధ్యక్షా, నిన్న సభ నుంచి తెలుగుదేశం వారిని బహిష్కరించారు. ఆ తరువాత వారు ధర్నా చేశారు. తరువాత వారు గట్టిగా కాంగ్రెస్ ప్రభుత్వం మీద, చెన్నారెడ్డిగారి మీద స్లోగన్స్ చేశారు. ఇవన్నీ ప్రజాస్వామ్య పద్ధతులలో భాగాలని నేను అనుకొంటున్నాను. వారు స్పీకర్ గారి మీద కూడా నినాదాలు చేశారు. ఇవన్నీ పార్లమెంటరీ డెమొక్రసీలో భాగాలనే నేను అనుకొంటున్నాను. ఎందుకంటే నిన్న ఇక్కడ జరిగాయి కాబట్టి. నేను సభకు కొత్తవాణ్ణి కావడం వల్ల ఈ విషయాలన్నీ నాకు తెలియవు. వారు నినాదాలు చేస్తున్నప్పుడు మేము కూడా నినాదాలు చేయడం ప్రజాస్వామ్య వ్యతిరేకమనిగానీ, అన్యాయమనిగానీ నేను భావించలేదు. మా పార్టీని, మా నాయకులను అగౌరవపరుస్తూ నినాదాలు చేస్తున్నారు. కాబట్టి వారికి వ్యతిరేకంగా నినాదాలు చేయాలనే ఉద్దేశంతో, ప్రొటెస్ట్ తెలియజేయాలనే ఉద్దేశంతో నేను కూడా నినాదాలు చేశాను. మా

సభ్యులను ఉత్సాహపరచి అక్కడికి తీసుకువెళ్లి వారితో కౌంటర్‌గా నినాదాలు చేయించాను. అలా నినాదాలు చేసిన తరువాత అక్కడనుంచి వెళ్లిపోయాం. వారియొక్క (ప్రతిపక్షం వారి) కోరిక మీద అక్కడి నుంచి వెకేట్‌చేసి వెళ్లిపోయాము. దీనికి తెలుగుదేశం వారు ఇంతటి శిక్ష నాకు విధిస్తారని అనుకోలేదు. ఇది అప్రజాస్వామికం కాదా అని సభికులందరినీ, ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులను, నాయకులను అడుగుతున్నాను. నన్ను క్రిందపడవేసి కొడుతున్నప్పుడు కాళ్లతో తంతున్నప్పుడు నేను జయరాంబాబు, నర్సిరెడ్డిగారు - ఆ ఇద్దరి కాళ్ల మధ్యన సందు చేసుకొని పారిపోయి రూమ్ నెంబర్ 45లో గంటసేపు దాక్కొని వుండకపోతే నన్ను ఖచ్చితంగా చంపివుండేవారేమో అని నేను అభిప్రాయపడుతున్నాను. ఈ సభలో మాట్లాడే అవకాశం కూడా నాకు వుండేది కాదని బాధపడుతున్నాను. వారి దగ్గర కత్తులు, మారణాయుధాలు వున్నాయి. అంతేకాదు, వారు నన్ను కొడుతున్నప్పుడు నా ప్రక్కనే ఇద్దరు శాసనసభ్యులు జయరాంబాబు గారు, నర్సిరెడ్డిగారు వున్నారు. వాళ్లను పేరుపెట్టి అనలేదు కాని నన్ను వీడేరా అంబటి రాంబాబు. నిన్న నినాదాలు చేసింది వీడేరా అన్నారు. వీడేరా వాగాడు అని అన్నారు అందువల్ల నన్ను ఐడెంటిఫై చేసి కొట్టడంలో గల దురుద్దేశాన్ని సభ్యులందరూ ఆలోచించాలని ప్రార్థిస్తున్నాను. ఇది ప్రజాస్వామ్యం పట్ల జరిగిన ఘోర విఘాతంగా సభ్యులందరూ భావించాలి. నేను గౌరవసభ్యుడు దేవినేని నెహ్రు పేరును ఎందుకు ఉదహరిస్తున్నానంటే వాళ్లు రావడం దేవినేని నెహ్రూగారి క్వార్టర్‌లోంచి వచ్చారన్నది నూటికి నూటయాభై పాళ్లు నిజం. నేను పారిపాయి రూమ్ నెంబర్ 45లో దాక్కొన్న తరువాత నర్సిరెడ్డి గారు, ఇంకొందరు వ్యక్తులు ఎదురు ఎటాక్‌గా వారిని తరిమితే వారు డైరెక్ట్‌గా పారిపాయి దేవినేని నెహ్రూగారి క్వార్టర్‌లో దాక్కొని షట్టర్స్ వేసుకొన్నారు. ఆ తరువాత పోలీసువారు వచ్చిన తరువాత వారికి మేము రిపోర్ట్ చేస్తే వారు క్వార్టర్‌ను సోదా చేసి ఇద్దరు వ్యక్తులను పోలీసు కస్టడీలోకి కుడా తీసుకొన్నారు. నేను సభ్యులను కోరేది, ముఖ్యంగా అధ్యక్షుల వారికి మనవి చేసేది ఏమిటంటే న్యూ ఎం.ఎల్.ఏ క్వార్టర్స్ అంటే శాసనసభ్యులు వుండేది. అక్కడ వుండడం శాసనసభ్యులకు ప్రమాదకరంగా పరిణమిస్తోంది. అక్కడ గూండాలను, రౌడీలను మేపే సాంప్రదాయం, పద్ధతి కొనసాగి ఎం.ఎల్.ఏల మీద, వ్యతిరేకులైన వారి మీద దాడిచేసే పద్ధతి న్యూ ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్‌కు, ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీకి, ఆంధ్ర రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి సరైన పద్ధతి కాదు. ఈ విషయాన్ని గురించి కూలంకషంగా ఆలోచించి ఇకముందు ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్‌లో, ఆ ప్రాంగణంలో ఒక శాసనసభ్యుడి మీద గాని, ఏ వ్యక్తి మీద గాని దాడి జరగనటువంటి విధంగా కఠినమైన చర్య తీసుకోకపోతే శాసనసభ్యులపై దాడిచేసిన గూండాలు అనతి కాలంలోనే శాసనసభ్యులను చంపినా దిక్కులేదని మనవి చేస్తున్నాను. ఈ వేళ ఒక శాసనసభ్యుడిని చంపడానికి ప్రయత్నం చేసిన వారిపై కఠినమైన చర్య తీసుకోకపోతే ఇది విపరీత పరిణామాలకు దారితీసే ప్రమాదం వుంది. ఎం.ఎల్.ఏ. క్వార్టర్‌లో కనీసం శాసనసభ్యుడి ప్రాణాలైన కాపాడలేని ప్రమాదకరమైన పరిస్థితులు వున్నాయని మనవి చేస్తున్నాను. ఈ అంబటి రాంబాబు గురించి ఆలోచించకండి. ఒక శాసనసభ్యుడికి జరిగిన ప్రమాదం గురించి ఆలోచించి ప్రతి శాసనసభ్యుడూ ఇది తన పట్ల జరిగిన సంఘటనగా భావించి రూల్స్‌కు అనుగుణంగా కఠినమైన చర్యలు తీసుకొవలసిందిగా మీ ద్వారా సభ్యులను, మిమ్ములను ప్రత్యేకంగా కోరుతున్నాను. నాతోపాటు వున్నటువంటి నర్సిరెడ్డిగారు, జయరాంబాబు గారు కూడా సంఘటన పూర్వాపరాలను తెలియజేయడానికి

వారికి కూడా అవకాశం ఇస్తే బాగుటుందని మనవి చేస్తున్నాను. దీని వల్ల టైం వేస్ట్ అవుతుందని కాదు, జరిగింది చాలా ప్రమాదకరమైన విషయం. కాబట్టి దీని గురించి ఒక రోజే కాదు, మూడు రోజులు చర్చించినా ప్రమాదం లేదు. ఇది అమూల్యమైన కాలాన్ని వేస్ట్ చేయడం కాదు. దీనిపై కూలంకషంగా చర్చ జరిపి ప్రజాస్వామ్యవాదులంతా దీనిని ఖండించి ఇకముందు ఇలాంటి సంఘటన జరగకుండా వుండే విధంగా తగు చర్య తీసుకోవలసిందిగా మీకు మనవి చేస్తున్నాను. రాత్రి నేను పోలీసు వారికి రిపోర్టు ఇచ్చిన తరువాత ఇద్దరిని మాత్రం అరెస్టు 10.00 చేయగలిగారు. చాలా క్విక్‌గా నేను రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. పోలీస్ యాక్షన్ కూడా ఉ. సరిగా లేదేమోననీ నాకు అనుమానంగా వుంది. దీనిపై మీరు దృష్టిపెట్టవలసిన అవసరం ఉంది. అంతేకాకుండా నెహ్రూగారి క్వార్టర్ నుంచి బాంబులు వేయండి, బాంబులు వేయండి అని కేకలు వేసి రాళ్లు విసిరితే జనం పారిపోవడం కూడా జరిగింది. అందువల్ల ఆ క్వార్టర్‌లో బాంబులు, కత్తులు, బరిశెలు, మనిషి ప్రాణాలు తీసే అన్ని ఆయుధాలూ వున్నాయనే అనుమానం కలుగుతున్నది. కాబట్టి ఈ విషయం మీద కూడా దృష్టి పెట్టి అక్కడ సోదా వేయవలసిన అవసరం కూడా వుందని మీకూ, మీ ద్వారా సభ్యులకూ మనవి చేస్తూ సెలవు తీసుకొంటున్నాను.

(శ్రీ కె.వి. నర్సిరెడ్డి, శ్రీ పి. సుధీర్‌కుమార్ తదితర కాంగ్రెస్ - ఐ సభ్యులు మాట్లాడేందుకు ప్రయత్నించారు)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- నర్సిరెడ్డిగారూ, మేము అన్ని పార్టీలతో సంప్రదించి ఒక అవగాహనకు వచ్చాము. ఆ ప్రకారం సభను నడవనివ్వండి. బడ్జెట్ మీద మాట్లాడేందుకు మీకు ఇంకోసారి అవకాశం వస్తుంది. ఇప్పుడు వీలులేదు. సుధీర్‌కుమార్‌గారూ, మీరు దీని మీద 304 నోటీసు ఇచ్చారు కదా. అది వచ్చినప్పుడు మీకు అవకాశం వస్తుంది. కాబట్టి మన అవగాహన ప్రకారం మీరు ఇప్పుడు మాట్లాడడానికి వీలులేదు.

శ్రీ పి. జనార్ధనరెడ్డి (ఖైరతాబాద్) :- మేము చెపుతాము.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- జనార్ధన్‌రెడ్డి గారూ, మొదట మనం సమావేశమైనప్పుడు గందరగోళంగా వుంటే అన్ని పార్టీల వారిని పిలిచి సంప్రదించిన మీదట సభలో జరపవలసిన కార్యక్రమాన్ని గూర్చి ఒక అవగాహనకు వచ్చాం. అవగాహన ప్రకారం ఎగ్రీవ్‌డ్ పర్సన్ రాంబాబు గారు వివరించిన తరువాత అన్ని పార్టీల వారు మాట్లాడిన తరువాత ప్రభుత్వం సమాధానం ఇవ్వవలసిన అవసరం వుంది. ఆ ప్రకారం సభ జరుపుకొందాం. మధ్యలో ఇంటర్‌ఫియరెన్స్ వద్దు. సమరసింహారెడ్డి గారూ, తమరు సభ్యులకు సర్దిచెప్పండి. మన అవగాహన ప్రకారం సభ జరిగేట్టు చూడాలి.

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి :- నేను ఒక అంశం లేవనెత్తాను. సస్పెండ్ కాబడిన ఇద్దరు సభ్యులు ఇక్కడ కూర్చున్నారు. తమరు లిస్ట్ చూసి తక్షణం చర్య తీసుకోవలసిన అవసరం వుంది. లేకపోతే మనం రూల్స్‌కు విరుద్ధంగా సభా కార్యక్రమాలు జరిపినట్టు అవుతుంది. కాబట్టి ఆ ఇద్దరు సభ్యులను నేమ్ చేసి పంపించవలసిందిగా కోరుతున్నాను. వారు ఒకవేళ తాము అప్పుడు లేము అంటే మాకు అభ్యంతరం లేదు.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- దయచేసి వారి పేర్లు చెప్పండి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- బలరామకృష్ణమూర్తి గారు, దామోదర్ రెడ్డిగారు కూడా సస్పెండ్ అయినట్లు నా దగ్గర వున్న లిస్టులో ఉంది. ఆ సమయంలో తాము ఇక్కడ లేమని వారు అంటే మాత్రం నేను క్వశ్చన్ చేయదలచుకోలేదు.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- గౌరవ సభ్యులు వున్నారు. వారిని అడగండి.

శ్రీ యం. దామోదర్‌రెడ్డి (కమలాపూర్) :- మేము ఆ సమయంలో లేము, లేనప్పుడు లిస్టులో మా పేర్లను ఎట్లా ఇంక్లూడ్ చేశారు.

శ్రీ కె. బలరామకృష్ణమూర్తి (మార్టూరు) :- మేము అప్పుడు లేము.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- ఆ గౌరవసభ్యులు అప్పుడు లేరు. వారు ఉన్నారనే అసత్యపు ఆరోపణను మేము ఖండిస్తున్నాం. వారు దానిని ఉపసంహరించుకోవాలి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- వారు లేరు అంటే మాత్రం ఐయామ్ యాక్సెప్టింగ్ ఇట్.

శ్రీ కె. రోశయ్య :- అధ్యక్షా, తమకు ఒక విజ్ఞాపన. మనం ఇందాకా మాట్లాడుకొన్నప్పుడు ఎవరికైతే దెబ్బలు తగిలాయో వారికి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలనుకొన్నాం. అప్పటికి మాకు అందిన సమాచారం ప్రకారం రాంబాబు గారికే దెబ్బలు తగిలాయని తెలిసింది. కాని ఇక్కడకు వచ్చిన తరువాత రాంబాబు గారితో పాటు నర్సిరెడ్డి గారికి కూడా దెబ్బలు తగిలాయి అంటున్నారు. అతడికి కూడా దెబ్బలు తగిలాయి కాబట్టి అతణ్ణి కూడా మాట్లాడనివ్వండి.

(తెలుగుదేశం గౌ॥ సభ్యులచే అంతరాయము)

డాక్టర్ కె. శివప్రసాదరావు :- ఒప్పందానికి వ్యతిరేకంగా మీరు సభను నడుపుతున్నారు అధ్యక్షా ?

శ్రీ కె. రోశయ్య :- మామూలుగా పార్టీకి ఇంతమందిని మాట్లాడనివ్వండి అని మేము అడగడం లేదు. మనం మాట్లాడుకొన్నప్పుడు మనకు అందిన సమాచారం ఏమిటంటే రాంబాబు గారు దెబ్బలు తిన్నాడని. అయితే ఇక్కడికి వచ్చాక రాంబాబు గారికే కాదు. వారితో పాటు నర్సిరెడ్డి గారికి కూడా దెబ్బలు తగిలాయి అన్నారు. అది తమరు వెరిఫై చేసి నిజమే అయితే నర్సిరెడ్డిగారు కూడా మాట్లాడవచ్చు. తరువాత వారిని మాట్లాడమనండి, సమాధానం చెప్పవచ్చు.

శ్రీ కె. శివప్రసాదరావు :- గౌరవసభ్యులు తన ఒక్కడికే దెబ్బలు తగిలాయని చెప్పారు. వారిని తమరు మాట్లాడమన్నారు. ఇప్పుడు దానిని మారుస్తున్నారు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- తక్కినవారు మాట్లాడిన తరువాత ప్రభుత్వం రిప్లయి ఇవ్వబోయేముందు నర్సిరెడ్డి గారికి అవకాశం ఇస్తాను.

శ్రీ పి. జనార్ధనరెడ్డి :- దెబ్బలు తగిలిన వారిని మాట్లాడనివ్వండి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- అక్కడ జరిగిన ఈవెంట్స్ రాంబాబు గారు నేరేట్ చేశారు.

ఇతర పార్టీల సభ్యులు చెప్పిన తరువాత నర్సిరెడ్డి గారికి చివర అవకావం ఇస్తాను. ఈ ఇన్సిడెంట్ మీద తక్కిన వారి అభిప్రాయాలు విన్న తరువాత నర్సిరెడ్డి గారికి అవకాశం ఇస్తాను.

(ఇంటరప్షన్స్)

శ్రీ పి. జనార్ధనరెడ్డి :- దెబ్బలు తగిలిన తరువాత ఎక్కడికిపోవాలి సర్టిఫికేట్ తేవడానికి ?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- నర్సిరెడ్డి గారికి దెబ్బలు తగిలినట్టు ముందు మా నోటీసుకు రాలేదు. రాంబాబు గారు దెబ్బలతో మా దగ్గరకు వచ్చారు. వారి దెబ్బలు కనిపించాయి. వారికి అవకాశం ఇచ్చేందుకు ఒప్పుకోవడం జరిగింది. ఇప్పుడు నర్సిరెడ్డి గారికి కూడా దెబ్బలు తగిలాయంటున్నారు కాబట్టి వారికి కూడా అవకాశం ఇస్తాను. కాని తక్కినవారికి ముందుగా ఇస్తే మీకు నష్టం ఏమిటో చెప్పండి?

శ్రీ కె. రోశయ్య :- మనం అనుకొన్నది ఏమిటంటే ఏ మెంబర్ అయితే దెబ్బతిన్నారో వారికి ఫస్ట్ ప్రిఫరెన్స్ ఇవ్వాలని అనుకొన్నాం. నర్సిరెడ్డిగారు కూడా దెబ్బతిన్నారు కాబట్టి ఆ ప్రిన్సిపుల్ ప్రకారం వారికి ముందు అవకాశం ఇవ్వాలని కోరుతున్నాను తప్ప లేకపోతే నర్సిరెడ్డి గారికే ప్రాధాన్యత ఇవ్వాలి. మాకే అవకాశం ఇవ్వాలని కాదు.

శ్రీ పి. జనార్ధనరెడ్డి :- దెబ్బలు తగిలాయని మేము చెపితే దెబ్బలు తగిలిన వారిని మాట్లాడనివ్వరా?

శ్రీ డి.కె. సమరసింహారెడ్డి :- నర్సిరెడ్డి గారిని మాట్లాడనివ్వండి.

(ఈ సందర్భంలో శ్రీ పి. జనార్ధనరెడ్డి, శ్రీ ఎ. వీరప్ప, శ్రీ పి. సుధీర్‌కుమార్, శ్రీ ఆర్.దామోదర్ రెడ్డి, శ్రీ కె.వి. నర్సిరెడ్డి మొదలైన గౌరవ సభ్యులు అధికారపక్షము వైపు నుండి లేచారు)

ఉ.10.20 శ్రీ పి. సుధీర్‌కుమార్ (మలక్‌పేట్) :- అధ్యక్షా, నర్సిరెడ్డిగారిని మాట్లాడనివ్వాలి.

(ఇంటరప్షన్స్)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- దయచేసి కూర్చోండి. అవకాశం ఇస్తాను. నాగేశ్వరరావు గారూ, ఆయనకి కూడా దెబ్బలు తగిలాయని అంటున్నారు. అతనికి కూడా అవకాశం ఇద్దాము. శివప్రసాదరావు గారు ఒప్పుకున్నారు. మీరు కూడా ఒప్పుకుంటే ఈ సమస్య ఇట్లా పరిష్కారం చేయవచ్చును.

(ఇంటరప్షన్స్)

(అధికారపక్షానికి చెందిన పలువురు సభ్యులు లేచి నిలబడ్డారు)

దయచేసి కూర్చోండి నేను వారికి అవకాశం ఇస్తాను.

శ్రీ పి. నాగేశ్వరరావు :- ఎవరికి దెబ్బలు తగిలినా చెప్పుకోడానికి అర్హత ఉంది. అందుకు అభ్యంతరం లేదు. ఆయన గాయపడి చెప్పారు. అదేరకంగా వీరు కూడా చెప్పుకోడానికి అభ్యంతరం లేదు. అయితే అక్కడ ఏం జరిగింది అన్న వరకే పరిమితం

అవుదాము. రిక్వెస్ట్ ఇప్పుడు వచ్చింది కనుక అవకాశం ఇవ్వడానికి మీకు హక్కు ఉంది. అభ్యంతరం లేదు. పరిశీలన చెయ్యడం మీ హక్కు. కాదనము. కానీ ఈ పద్ధతేమిటండీ? ఇటీజ్ షేం. What is this? Don't talk. You cannot do anything. I am speaking. We are going by law. Take care. We want to protect the dignity of the House.

(Interruptions)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- నో, నో, ప్లీజ్ సిట్ డవున్. నర్సిరెడ్డి గారికి అవకాశం ఇస్తాను. కూర్చోండి.

**Sri P. Nageswara Rao** :- I am only responding to you.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- నేను నాగేశ్వరరావు గారిని రిక్వెస్ట్ చేసి, వారి అభిప్రాయం అడిగాను. మధ్యలో డిస్టర్బ్ చేయడానికి వీలులేదు. నర్సిరెడ్డిగారూ మాట్లాడండి.

శ్రీ పి. నాగేశ్వరరావు :- నాకేమీ అభ్యంతరం లేదు. ఎవరికి దెబ్బలు తగిలినా ఖండిస్తాము. ఎవరికి దెబ్బలు తగిలినా చెప్పుకోడానికి హక్కుంది. అవకాశం ఇవ్వడానికి మీకు హక్కుంది. కాని 'దిస్ ఈజ్ నాట్ ది ప్రాపర్ వే' అని మాత్రమే మీ దృష్టికి తేదలచుకున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- కరెక్ట్.

శ్రీ పి. నాగేశ్వరరావు :- గౌరవ సభ్యులున్నారు. సీనియర్ మంత్రులున్నారు. మేము ఎట్లా బిహేవ్ చేస్తున్నాము? హవుస్‌లో కానీ, మీ వద్ద కానీ కూర్చునప్పుడు మేము ఎట్లా బిహేవ్ చేస్తున్నాము? మా పేషెన్స్‌ని క్వశ్చన్ చేస్తే, ఇందుకు ఎవరు ప్రయత్నం చేసినా, మేము కూడా ఎలవ్ చెయ్యము. మీకు ఇచ్చే కో ఆపరేషన్ భవిష్యత్తులో ఇట్లా కొనసాగదు.

డా. కె. శివప్రసాదరావు :- అధ్యక్షా ....

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- ముందు నర్సిరెడ్డి గారికి అవకాశం ఇద్దాము. మీకు ఇస్తాను.

డా. కె. శివప్రసాదరావు :- అధ్యక్షా, మనందరం మాట్లాడేటప్పుడు గౌరవ సభ్యులు రాంబాబు గారు అక్కడకు రావడం జరిగింది. వారు మాట్లాడడానికి అంగీకరించాము. గాయపడిన వ్యక్తి తనతో పాటు నర్సిరెడ్డి గారు కూడా గాయపడినట్లుగా చెప్పలేదు. అందువల్ల వాస్తవాల మీద అందరికీ నమ్మకం లేదు. ఇక్కడకు వచ్చిన తరువాత రెండవ వ్యక్తికి కూడా దెబ్బలు తగిలాయని చెప్పడం వల్ల నమ్మకం తగ్గుతోంది.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- నర్సిరెడ్డి గారికి దెబ్బలు తగిలాయని అప్పుడు చెప్పలేదు. నిజమే. అయితే గౌరవ సభ్యులు చెబుతున్నప్పుడు మనం నమ్మాలి.

(ఇంటరప్షన్స్)

శ్రీ కె. రోశయ్య :- అధ్యక్షా, ఒక్క మాట చెబుతాను ...

శ్రీ బి. వెంకటేశ్వరరావు :- అధ్యక్షా, శాసనసభ్యులలో ఏ సభ్యుడిని ఎక్కడ, ఎవరు కొట్టినా సహించడానికి వీలులేదు. వీటిని ఖండించడానికి మేము ముందుంటాము. మీరు

సీనియర్ మంత్రిగారికి అవకాశం ఇవ్వవచ్చును. కానీ ప్రతిదానికీ ఇట్లా లేస్తే మంచిది కాదు. శాసనసభ్యుల హాస్టల్‌లో ఇటువంటి జరుగుతుంటే, ప్రభుత్వం ఏమి చేస్తుంది?

(ఇంటరప్షన్స్)

శాసనసభ్యులను కొట్టడం అనేది ఎవరూ హర్షించరు. మీరు రూలింగ్ ఇవ్వాలి. కానీ అట్లాకాకుండా గొంతులు ఉన్నాయని, జనబలం ఉందనే పేరుతో ఈ సభను సాగనివ్వము అనుకుంటే వారికే అప్రతిష్ఠ. కానీ మేము మాత్రం భయపడిపోయేవారం కాదు. మందబలంతో ఈ పద్ధతిని కొనసాగించాలనుకోవడం ఏ పరిస్థితిలోనూ సాధ్యం కాదు. వారు విజ్ఞప్తి చేస్తే. అవకాశం ఇవ్వండి.

శ్రీ కె.వి. నర్సిరెడ్డి (గురజాల) :- అధ్యక్షా, నిన్న నేనూ, తోటి శాసనసభ్యులయిన మిత్రులు రాంబాబు గారు, జయరాంబాబు గారు న్యూ ఎం.ఎల్.ఏ. క్వార్టర్స్‌లో ఉన్న నాన్ వెజిటేరియన్ క్యాంటీన్ నుంచి, డిన్నర్ పూర్తి చేసి వస్తున్న సందర్భంగా కొందరు గూండాలు, 'వీడేరా రాంబాబు' అంటూ అతని మీదకు రావడం జరిగింది. దాంతో నేను 'అనవసరంగా మాట్లాడకండి' ఎందుకు ఇదంతా? .. అని నెట్టడం, దాని మీద వేరే పదిమంది రాంబాబు మీదకు రావడం జరిగింది. ఆయనను నిర్దాక్షిణ్యంగా క్రింద పడేసి ఇష్టం వచ్చినట్లు కొట్టడం జరిగింది. ఇంతలో మరొకడు 'బాంబులు తీసుకురా, అక్కడున్నాయి' అని కేకలు వేయడం జరిగింది. రాంబాబును రక్షించే సమయంలో నేను అడ్డుకున్న సందర్భంగా నన్ను కూడా చేతితో కొట్టిన మాట వాస్తవం.

(అధికారపక్షము వైపు ఉంచి 'షేం - షేం' అనే కేకలు వినిపించాయి.)

మన న్యూ ఎం.ఎల్.ఏస్ క్వార్టర్స్‌లో శాసనసభ్యులకు రక్షణగా ఉండే గన్‌మెన్ ఉండాలి కానీ గూండాలు, రౌడీలను తోడుగా తెచ్చుకునే సాంప్రదాయాన్ని అరికట్టకపోతే, ఈ రాష్ట్రం. ఈ దేశం ఎటు పయనిస్తున్నదో తెలియకుండా పోతుంది. మేము ఏమీ చేతులు కట్టుకుని కూర్చొలెదు తగాదాకు చేతనైతే రమ్మనండి. సిద్ధంగా ఉన్నాము.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- తగాదాలు వదిలేద్దాము. జరిగిన విషయం చెప్పండి. ఎప్పుడయినా సరే తగాదాలకు ఎవరూ పోవడానికి వీలు లేదు.

శ్రీ కె.వి. నర్సిరెడ్డి :- వెధవ పనులు, అక్రమ పనులు సహించేది లేదు. ఒక తోటి శాసనసభ్యుడి మీద కిరాయి గూండాలు అక్రమంగా పేరు పెట్టి, దాడి చేస్తుంటే, ఇదెక్కడికి దారి తీస్తుందని ఆందోళన చెందుతున్నాను. ఇంత గొడవ జరుగుతుంటే, ప్రక్కనున్న రూమ్స్ నుంచి చాలా మంది రావడం జరిగింది. మా వెంట గన్‌మ్యాన్ ఉన్నా కూడా ఫైరింగ్ ఓపెన్ చెయ్యనివ్వలేదు. రాత్రిపూట ఫైరింగ్ చేస్తే, ఎవరికి ఏం జరుగుతుందో, దోషులే కాక నిర్దోషులు కూడా బాధపడతారు, గాయాలు తగలవచ్చు అని నివారించి, మేము వారిని నెట్టివేసే ప్రయత్నం చేసినప్పుడు అక్కడ గల పోలీసు వారు కేకలు వేసి, పట్టుకోడానికి వెంటబడితే, విజయవాడ శాసనసభ్యుడయిన దేవినేని నెహ్రూ గారి క్వార్టర్స్‌లోకి వెళ్లడం మాట వాస్తవం అని మనవి చేస్తున్నాను. అప్పుడు నేనూ, ఇంకా చాలామంది వ్యక్తులు పోలీసు సహాయంతో నెహ్రూ గారి

క్వార్టర్స్ వద్దకు వెడితే. వాళ్లు. 'డిక్కీ నుండి బాంబులు తియ్యండిరా' అంటూ ప్రక్కనే గల చిన్న చిన్న రాళ్లు తీసుకొని, మా వాళ్ల మీద దాడి చేసినది వాస్తవం అని మనవి చేస్తున్నాను. పోలీసులు సాక్షులుగా ఉన్నారు. వారిని కూడా విచారిస్తే నిజానిజాలు బయటకు వస్తాయి అని మనవి చేస్తున్నాను. పోలీసులను కూడా దుర్భాషలాడిన మాట వాస్తవం. రాంబాబు స్లోగన్స్ ఇచ్చారనే దుగ్ధతో, దురుద్దేశంతో రాంబాబు మీద ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన గూండాల మీద, వారికి అక్కడ ఆశ్రయం కల్పించిన వ్యక్తుల మీద కూడా చర్య తీసుకోవాలని మనవి చేస్తున్నాను. శాసనసభ్యులకు అవసరమైన గన్‌మెన్ ఉండాలి తప్ప మిగతా గూండాలను న్యూ ఎం.ఎల్.ఏ క్వార్టర్స్‌లో ఎలవ్ చేయడం వల్ల రాబోయే కాలంలో చాలా అనర్థాలకు, అక్రమాలకు దారితీస్తుందని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇటువంటి పరిస్థితులను ఎదుర్కోడానికి ప్రభుత్వపరంగానూ, స్పీకరుగా తమరు కూడా తగిన జాగ్రత్త చర్యలు తీసుకొకపోతే, ఏ శాసనసభ్యుడికి కూడా రక్షణ ఉండదని మనవి చేస్తున్నాను. ఈ రకమైన పద్ధతులను ఎవరు అనుసరించినా, ఎవరికి వారే ఏదో నాశనానికి గురి అవుతారు. ఇది ప్రజాస్వామ్యం మీద జరిగిన దాడిగా భావిస్తున్నాను. ఒక తొట్టి శాసనసభ్యుడి మీద ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపైన కఠినంగా చర్య తీసుకుని శిక్షించాలి. ఇటువంటి వారు ఏ పార్టీకి చెందినా కానీ ఎంకరేజ్ చేయరాదు. ఈ సభ ద్వారా అందరి శాసనసభ్యులకు మనవి చేస్తున్నాను. ఈ దాడిలో పాల్గొన్న గూండాలను, రౌడీలను తప్పనిసరిగా ఏరివేసి, వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

10.30 ఉ. రాత్రి పోలీసులు వెళ్లినప్పుడు పోలీసులను కూడా నానా దుర్భాషలూ ఆడిన విషయం పోలీసులు కూడా మీకు తెలియజేస్తారు. వారి క్వార్టర్సులోనే ఇద్దరు వ్యక్తులను కూడా పోలీసులు బయటకు తీసుకు వచ్చి అరెస్టు చేసినట్లు కూడా తెలుస్తున్నది. ఇలాంటి వారు ప్రవేశించే హక్కు లేకుండా. చేయకపోతే శాసనసభ్యులు నివసించే ప్రాంతాలలో ఉన్నటువంటి గృహాలకు రక్షణ ఉండదు న్యూ ఎం.ఎల్.ఏ క్వార్టర్స్. ఎర్రమంజిల్ కాలనీ కాని ఇంకా ప్రైవేటుగా ఉండే శాసనసభ్యులకు కూడా ఇలాంటి పద్ధతులు అవలంభించినట్లయితే రక్షణ కరువవుతుంది, నిన్న జరిగిన దానిలో కొన్ని స్లోగన్స్ వారుఇస్తే దానికి ప్రతిగా రాంబాబు కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులను కలుపుకొని 'రాజీవ్ గాంధీ జిందాబాద్' రాజీవ్ గాంధీ దేశ్‌కి నేతా అని కౌంటర్‌గా స్లోగన్స్ కూడా ఇవ్వడం జరిగింది. అంతకు ముందు వాళ్లు మా పార్టీకి వ్యతిరేకంగా, పార్టీ నాయకులకు వ్యతిరేకంగా స్లోగన్స్, నినాదాలు ఇచ్చినా మేము సంయమనంతో గట్టిగా నినాదాలు ఇచ్చినాము కానీ ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడలేదు. రాబోయే కాలంలో కూడా పార్టీలకు అతీతంగా శాసనసభ్యునికి గౌరవ మర్యాదలు ఉండేలాగ ప్రతి పార్టీ శాసనసభ్యులు కూడా మెలగాలని, వారి అనుయాయులకు తగినట్లుగా సూచనలు ఇచ్చి, ఇలాంటి చర్యలు నిర్వహించే అలవాటును మార్చుకోవాలని తమరి ద్వారా కోరుతున్నాను. దుండగలు మీద ప్రభుత్వం తక్షణమే తగిన చర్య తీసుకొని ఇలాంటి ఇన్సిడెంట్సు ఇక ముందు కాలంలో జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవలసిందిగా మనవి చేస్తున్నాను. మీరు నాకు ఈ అవకాశం ఇచ్చినందులకు ధన్యవాదాలు తెలియచేస్తూ శెలవు తీసుకుంటున్నాను.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- అధ్యక్షా, సత్యమేవ జయతే లైట్సు వెలగడం లేదు. నిన్నటి నుంచీ అది అలాగే ఉంది. సత్యాన్ని కాపాడండి. అక్కడ లైట్లు వెలిగేలా చూడండి. సత్యం లేకుండా పోతోంది.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- లైట్లు వస్తాయి లెండి. మీరు మాట్లాడండి.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- అధ్యక్షా, రాత్రి న్యూ ఎం.ఎల్.ఏ క్వార్టర్సులో అంబటి రాంబాబు గారూ, జయరాంబాబు గారూ. నర్సిరెడ్డి గారూ భోజనము చేసి వస్తుంటే వారిపైన దాడి జరిగిందీ అని చెప్పి గౌరవ శాసనసభ్యులు చెప్పారు. నేను మనస్ఫూర్తిగా ఖండిస్తున్నాను. ఎవరిపైన దాడి జరిగినా కానీ ఖండించవలసి ఉంది. అంతే కాదు ఈ రాష్ట్రం యొక్క ప్రజలను కాపాడడంలో, నియోజకవర్గ కార్యక్రమాలను నిర్వహించడంలో బాధ్యత వహించే గౌరవ శాసనసభ్యులపై దాడి అంటే అది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా భావించి దానిని మనస్ఫూర్తిగా ఖండిస్తున్నాను. అయితే శాసనసభ్యులు చెప్పిన విషయలు ఏవయితే ఉన్నాయో వాటితో బాటు కొన్ని విషయాలు మా దృష్టికి కూడా వచ్చిన సంగతి ఈ సభ ద్వారా మీకు మనవి చేస్తున్నాను. మంత్రవర్గ నిర్మాణం ఇటీవలనే జరిగింది. మళ్లీ కొత్తమంత్రులను చేర్చుకోవడం జరిగింది. ఈ మంత్రివర్గంలో సభ్యత్వం కోసం ఎంతోమంది ఎన్నో రకలుగా ప్రయత్నం చేసుకొంటున్నారు. కృషి చేసుకొంటున్నారు. అందరికీ తెలిసిన సంగతే.

(అంతరాయం)

**Mr. Dy. Speaker** :- Why you unnecessarily disturb? Please let him have his say.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- వారి యొక్క అభిమానం సంపాదించడానికి మంత్రివర్గంలో స్థానం సంపాదించడానికి నర్సిరెడ్డి గారు కృషి చేస్తున్నారని వార్తా పత్రికలలో చూసాము. గౌరవ ముఖ్యమంత్రి గారి కుమారునికి వీరితోబాటు కొంతమంది శాసనసభ్యులకూ నర్సిరెడ్డి గారు విందులూ,వినోదాలూ కల్పిస్తున్నారని వింటున్నాము.

(అంతరాయం)

మళ్లీ రాత్రి మంత్రివర్గ విస్తరణ జరిగిన తరువాత మళ్లీ విస్తరణ అవకాశాలు ఉన్నాయన్న నేపథ్యంలో భాగంగా...

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- చెప్పనివ్వండి. అదేమీ అన్‌పార్లమెంటరీ కాదు. కొంచెం ఇర్రెలవెంట్, అయితే అవ్వచ్చు. దానికి అభ్యంతరం ఏమిటి? దానివల్ల వచ్చే అఫెన్సేమీ లేదు దాని వల్ల మీకు వచ్చే నష్టం ఏమిటి? Please let him say. Don't disturb him.

(అంతరాయం)

డాక్టర్ కె. శివప్రసాదరావు :- విందు రాత్రి 10.30 గంటలకు సుమారుగా 20 మంది శాసనసభ్యులుకు ఇవ్వడం జరిగింది. అక్కడి నుంచీ రూమ్‌కి వెళ్లే ప్రయత్నంలో - నిద్ర మత్తో - ఇంక ఏ మత్తో తెలియదు కానీ - ఆ మత్తులో వస్తూ, వస్తూ గౌరవసభ్యులు ఇంతకు ముందు ఇక్కడ ఎన్.టి.ఆర్. ఫోటో ఉండాలి, వాడు తీసాడా, వీడు తీసాడా అని అసభ్యకరమయిన పదజాలంతో తెలుగుదేశం పార్టీ నాయకుణ్ణి నిందించడం జరిగిందని నేను విన్నాను. అక్కడ

ఉన్న కొంతమంది వ్యక్తులు దానిని ఖండించడం, ఖండించిన తరువాత ఘర్షణ జరగడం జరిగిందట. తరువాత ఏమయినా సరే జరిగిన సంఘటనలు జరిగాయేమో. జరిగిన సంఘటనలను ఖండించడం లేదు. ఏదయినా సరే ప్రభుత్వం మీది. విచారణ చేయించండి. నేరస్థులను పట్టుకోండి, శిక్షించండీ అంటున్నాము కానీ సమర్థించడం లేదు. అయితే మీ ముందు ఇందాక మీ సమక్షంలో ప్రతిపక్ష అగ్రనాయకులు గౌరవ శాసనసభ్యులను మాట్లాడమంటే మాట్లాడిన దానిలో వారు మన అందరికి ఇచ్చిన అభిప్రాయం ఏమంటే వారు నా ఒక్కడి పైన దెబ్బ తగిలిందీ అన్నారు. రెండవ వ్యక్తి పేరు చెప్పలేదు. నాకు తగిలింది అన్నదే మరి ఈ సభలో చెప్పారంటే ఇప్పుడు రెండవ వ్యక్తికి తగలలేదని - ఇందులో వాస్తవాలు, ఇందులో జరిగిన సంఘటనల పట్ల ప్రతి ఒక్కళ్లకు అనుమానం ఉంది.

(అంతరాయం)

అంతేకాదు, ఒకసారి మన శ్రీనివాసులు రెడ్డి గారు చెప్పారు.

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- వారి ఒపీనియన్ వారిని చెప్పనివ్వండి. అది మీరు యాక్సెప్ట్ చేయనక్కరలేదు.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- న్యూ ఎం.ఎల్.ఏ. క్వార్టర్సు ఇవన్నీ కూడా శాసనసభ పరిధిలోకి వస్తాయి. వారి ఆత్మగౌరవం దెబ్బతిందని కూడా వారు చెప్పారు. ఈ శాసనసభలో ఇంతకు ముందు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాసనసభలో ప్రవేశించి దౌర్జన్యం జరిగింది ఎవరో, అదే విధంగా తెలుగుదేశం పార్టీ నాయకులయిన అశోకగజపతి రాజూ ఇంకా మిగతా వారి ఇళ్లపై దాడిచేసి కారులూ, ఇళ్ల కిటికీ అద్దాలు, వస్తువులూ ధ్వంసం చేసింది ఎవరో, దౌర్జన్యం చేసిన వ్యక్తులు ఎవరో ఒకసారి ఆలోచించమని కోరుతున్నాను. శ్రీనివాసులరెడ్డి గారి ఆత్మగౌరవాన్ని కాపాడింది తెలుగుదేశం. వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి పాడీ, పశువులు ప్రక్కకు తోలి పేడా, కాడికి పనికి వచ్చే పశువులను తనకు అప్పచెప్పి ఇచ్చిన ముఖ్యమంత్రి గారే వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసారు కానీ ఇంకెవరో కాదని మనవి చేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- ప్లీజ్ టెల్ ఓన్లీ రిలవెంట్ పాయింట్స్.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- ఇవన్నీ వారు లెవనెత్తిన అంశాలే. నేను కొత్తగా ఏమీ లేవదీయడం లేదు. వారు తీసిన అంశాలనే నేను మనవి చేస్తున్నాను. ఎవరో చెప్పినవి కాదు. వారు చెప్పుకొన్నారు. నాకు పేడా, కాడికి పనికి తప్ప పనికి రానిది ఇచ్చారని.

(అంతరాయం)

ప్రభుత్వం ఉంది. పోలీసు యంత్రాంగం ఉంది. జరిగిన సంఘటనను మేమంతా ఖండిస్తున్నాము. నేరస్థులను ఎందుకు పట్టుకోలేదు ? ఈ సంఘటన ఇలా ఉంటే దీనిని ఖండిస్తున్నాము. ముఖ్యమయిన విషయం. నిన్న సభలో 54 మంది సభ్యులను మీరు కేవలం మాకు న్యాయం జరగలేదని మా పట్ల వేధింపు ఆగాలనీ మా నాయకుల ప్రతిష్ట దిగజార్చాలని తప్పుడు కేసుల పెడుతున్నారనీ అన్నందుకు సస్పెండు చేసారు. వేధింపు చర్యలు కానీ ఇంకేమయినా కానీ...

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- అది మాట్లాడడానికి కూడా మనం ఒక అంగీకారానికి వచ్చాము. ఈ విషయం కూడా వారు ప్రస్తావించవచ్చు.

(అంతరాయం)

డాక్టర్ కె. శివప్రసాదరావు :- న్యాయం కోసం పోరాడుతున్నప్పుడు 54 మంది సభ్యులను మీరు బహిష్కరించారు.

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- రాంబాబు గారి మీద అటాక్ అయిన దానికీ దానితో బాటు నిన్న సస్పెన్షనుకి సంబంధించి వారికి అనుమానాలూ, అభ్యంతరాలూ ఉంటే చెప్పేదానికి నిర్ణయం తీసుకొన్నాము. ప్లీజ్ రెజ్యూమ్ యువర్ సీట్స్.

(అంతరాయం)

(Mr. Dy. Speaker was on his legs)

వారిని చెప్పనివ్వండి. చెప్పడానికి అభ్యంతరం చెప్పడం న్యాయం కాదు. Ultimately the Government will reply, I will give ruling. దయచేసి అభ్యంతరం చెప్పడానికి వీలు లేదు. దయచేసి అందరూ కూర్చోండి.

శ్రీ కె. రోశయ్య :- మనం అందరమూ కూడా మాట్లాడుకున్నప్పుడు తమ సమక్షంలో - వారు నిన్న జరిగిన సంఘటన తరువాత ఎలా జరగాలి ఏమిటి అన్నది కూడా మాట్లాడతాము అన్నారు. దానికి అందరము అంగీకరించాము దానికి అభ్యంతరం లేదు. Let him confine to the subject. అది వదిలి పెట్టి ఏదో అంటే మళ్లీ మేము కూడా చెప్పవలసి ఉంటుంది. ఎక్కడెక్కడికో వెళ్లాలి. వారు కాడి, పేడా అన్నారనుకోండి మేము ఏదో కాళ్ల పూజ అనాలి. ఎందుకు అదంతా? అవన్నీ ఎందకు ?

**Dr. K. Sivaprasada Rao :-** I am confining to the subject. నేను కొత్తగా లేవనెత్తిన అంశాలు ఏమీ లేవు. నిన్న ఈ గౌరవ సభలో మీ సమక్షంలో తెలుగుదేశం పార్టీ సభ్యులూ, గౌరవ ప్రతిపక్ష నాయకులు ఎన్.టి. రామారావు గారి పైన వారి ప్రతిష్ట దిగజార్చే విధంగా తప్పుడు కేసులు బనాయిస్తున్నారు, వేధింపు చర్యలు చేస్తున్నారు. వాటిని అన్నిటినీ ఆపివేయమని, మాకు న్యాయం జరగాలనీ న్యాయం కోసం అడిగినప్పుడు, మీరు ఏ కారణాల వల్ల అయితేనేమి సస్పెండు చేయడం జరిగింది. మీకు మనవి చేస్తున్నాను. సస్పెండ్ చేసిన
10.40 తీరును నేను ప్రశ్నిస్తున్నాను. ఇది ప్రొసీజర్‌గా, ఇరెగ్యులర్ అనేది నే వారి దృష్టికి
ఉ. తీసుకువస్తున్నాను. In Rule 300 (1) it is said : "The Speaker, if he deems it necessary name a member who disregards the authority of the Chair or abuses the rules of the House persistantly and willfully obstructing the business thereof".... ఈ సందర్భంలో 54 మంది సభ్యులయితే తమరు చెప్పారే కానీ పేర్లు

మెన్షన్ చేయలేదు. అందువలన మీరు చేసిన తీరును నేను ప్రశ్నస్తున్నాను. దాని వలన మాకు అన్యాయం జరుగుతుందని కూడా నేను మనవి చేస్తున్నాను.

(అంతరాయం)

**Mr. Dy. Speaker** :- I want to hear his speech. అది, ఇది కాదు. అన్నిటికి కలపి ఒక్కసారే.

డా. కె. శివప్రసాదరావు :- ఆ విధంగా సస్పెండ్ చేసి 54 మంది తెలుగుదేశం పార్టీ సభ్యులందరు కూడా రోడ్డు మీద అనాథలుగా ఈ సభ యొక్క నిర్ణయం కొరకు వేచి వున్నారు. ఈ నిర్ణయం వెనుక రాజకీయ హస్తం వుందనేది మా వాదన. దేనికని అంటే ఏమీ అభ్యంతర వాఖ్యలు కానీ, అభ్యంతరకరమైన ప్రవర్తన కానీ చేయకుండా వున్నప్పటికీ కూడా త్వరపడి కేవలం 15 నిముషాలలోనే ఈ తంతును పూర్తి చేశారని అంటే నేను ప్రధాన కారణం చెబుతున్నాను. ఈ ముఖ్యమంత్రి గారి చిన్న కొడకు శశిధరరెడ్డి గారు ముఖ్యమంత్రి గారిఛాంబర్ లోకి వచ్చి తమరికి ఇచ్చిన ఆదేశం వల్లనే బహిష్కరణ జరిగిందని నేను మనవి చేస్తున్నాను.

(అంతరాయం)

ఇది ఒక్కటే గుర్తు. వారు కాంగ్రెస్ పార్టీలో ఒక చిన్న పదవిలో వుంటే వుండవచ్చు.

(అధికారపక్షం నుండి గౌ॥సభ్యులు మాట్లాడడానికి ప్రయత్నించారు.)

**Mr. Dy. Speaker :-** Alright .... alright .. alright. please confine to the subject.

**Dr. K. Sivaprasada Rao** :- Sir, I am confining my self to the subject.

**(Interruptions)**

అసలు శశిధరరెడ్డి గారు ముఖ్యమంత్రి గారి ఛాంబర్‌లోకి వచ్చి మీకు ఆదేశం ఇచ్చిన తరువాత 15 నిమిషాలలోనే గౌరవప్రదమైన 54 మంది శాసనసభ్యులను బహిష్కరించడానికి వారికి ఏమి హక్కు వున్నది. ముఖ్యమంత్రి గారి కొడుకయితే కావచ్చు. లేకపోతే కాంగ్రెస్ పార్టీలో ఒక చిన్న పదవిలో వుంటే వుండవచ్చు. గౌరవ శాసనసభలోకి ప్రవేశించడానికి వారికి పాస్ ఏమయినా వుందా? ఆ పాస్ తమరు ఇచ్చారా? ఇచ్చిన సమయం ఏమిటి? దాని నంబరు ఏమిటి? ఇవన్నీ సభకు ఒకసారి తెలియజేయాలని కోరుతున్నాను.

(అంతరాయం)

అంతేకాదు, విమిష, నిమిషానికి ఆ ఛాంబర్‌లోనుండి సీనియర్ మంత్రులు చీఫ్ విప్ అందరూ కూడా ...

(అంతరాయం)

శ్రీమతి ఎన్. రాజకుమారి (వినుకొండ) :- అధ్యక్షా, అధ్యక్షా..

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- దయచేసి వారిని చెప్పనియ్యండి రాజకుమారి గారు. మీరు అబ్జక్ట్ చేస్తే వాళ్లు ఏదో బయపడ్డారనుకుంటారు. వారు చెప్పవలసినదంతా చెప్పనియండి. చివరకు రిప్లయ్ చెప్పవచ్చు.

**Sri N. Janardhana Reddy** :- Sir, I want to submit one thing. I do not know what has happened in your Chambers.

**Mr. Dy. Speaker** :- Nothing has happened in my chamber and he is not talking about my chamber.

**Sri N. Janardhana Reddy** :- No, what type of understanding you reached - what has happened in the Chamber and what type of understanding was reached, you please announce it. Becuase people will agitate. Mr. Rambabu was beaten. The seriousness has gone. Becuase you are allowing that one also and we are not objecting to other point. Let the opposition party leaders confine first to the subject of Rambabu and tnen go for other points. Let us not divert the points. You kindly direct like that. Becuase it is diluted.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- జనార్ధనరెడ్డి గారు దయచేసి మీరు అడిగిన దానికి కొంచెము రిప్లయ్ చెబుతాను. What you are raising is pertinent to....

**Sri N. Janardhan Reddy** :- No, it has been diluted.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- ఆ అండర్‌స్టాండింగ్ నేను చెబుతాను.

**Mr. N. Janardhan Reddy :-** No Sir, it was not proper. The very seriousness has gone. Mr. Deputy Speaker, the very seriousness is going. We do not mind their speaking about the next item.

శ్రీ పి. నాగేశ్వరరావు :- జనార్ధనరెడ్డి గారంటే నాకు కూడా కొంత గౌరవం వున్నది. ప్రొసీజర్ ఏది అడాప్ట్ చేస్తే దానిని ఫాలో కావాలి. ఇక్కడ వచ్చిన ప్రొసీజర్ ఏమిటంటే 54 మంది సభ్యుల గురించి చర్చించాలని కొందరు అంటూ వుంటే. అంతకంటే ముందు ఒక సభ్యుని మీద దాడి జరిగిందని, ఆ దాడిని మెన్షన్ చేసిన తరువాత ఆ విషయం చర్చించాలనే అంశము మీద మనకు అంగీకారము కుదిరింది. It has been made like that అయినా ఇక్కడకు వచ్చిన తరువాత ఇంకొక సభ్యుడు నర్సిరెడ్డి గారికి కూడా దెబ్బలు తగిలాయని అన్న తరువాత మేము కూడా అంగీకరించాము. ఇంకా ఎవరయినా వుంటే చెప్పడానికి మాకు అభ్యంతరం లేదు. ఇక్కడ డిస్కషన్ దాని మీద, దీని మీద అనే అంశము కాదు. అది రెయిజ్ చేసిన తరువాత ఈ ఇష్యూ రెయిజ్ చేస్తాము. రాంబాబు గారికి దెబ్బలు తగిలాయి. ఖండించదలచుకొంటే ఖండిస్తూ వుంటారు. ఒక వేళ ఖండించరనుకొంటే ప్రజలకు తెలుస్తుంది. Yes - I agree with you - and agree wth the spirit of your saysing ..

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :- మొదట ప్రతిపక్ష నాయకుల అభిప్రాయం చెప్పమనండి. తరువాత శివప్రసాదరావు గారు కండెమ్ చేసిన తరువాత కొంచెము యాడ్ చేసినారు. ఫరవాలెదు. కానీ మీరు ఏమి చెబుతారు. మీరు ఏమి చెబుతారు అన్న తరువాత దానికి రూలింగ్ యివ్వండి.

**Sri P. Nageswara Rao** :- Yes - i agree with you and with the spirit of it. సపరేట్‌గా చర్చించాలని అనుకొలేదు.

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :- సెపరేట్‌గా పెడితే పెట్టండి. అంత సీరియస్ ఇష్యూ కాదా? ఒక ఎం.ఎల్. ఏను కొడితే అంత సీరియస్‌నెస్ కాదా ?

**Sri P. Nageswara Rao** :- I agree with you. the agreement arrived at is అది మెన్షన్ చేసిన తరువాత ఈ అంశాన్ని మెన్షన్ చేయడానికి అంగీకారం కుదిరింది. The agreement reached by us - they are not separate.

**Sri N. Janardhan Reddy** :- Your agreement should be agreed to by the House. Let him put.

**Mr. Dy. Speaker** :- Yes, Yes.

**(Interruptions)**

**Sri Nallapu Reddy Srinivasulu Reddy** :- Sir, I am on a point of order as precedence.

**Sri P. Nageswara Rao** :- Sir, I am on my legs. I did not complete.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : నాగేశ్వరరావు గారు ముగించిన తరువాత మీకు అవకాశం ఇస్తాను. కూర్చోండి.

**Sri P. Nageswara Rao**:- Sir I have not yet completed. I am on my legs.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- నాగేశ్వరరావు గారు కంప్లీట్ చేసిన తరువాత మీది వింటాను.

శ్రీ నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి :- తరువాత మీరు నాకు అవకాశం ఇస్తారు గదా?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : తరువాత వింటాను.

శ్రీ పి. నాగేశ్వరరావు :- దయచేసి మనం ఇక్కడకు వచ్చిన విషయం ఈ బిజినెస్‌ను కొనసాగించడం కొసం అనేది అందరి బుర్రలలోకి వచ్చిన తరువాత ఒక అంగీకారానికి వచ్చాము.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : అది అందరికి తెలియజెప్పలేదని ఫీల్ అవుతున్నారు.

శ్రీ పి. నాగేశ్వరరావు :- తమ ద్వారా చెప్పండి. జనార్ధనరెడ్డి గారికి డౌట్ రావడం సహజమే. But what has taken place.. it can be argued. I know the delay tactics. You can adopt some delay tactics. They can adopt some tactics but we are not going to be a party to it. We wanted to discuss some peoples' problems and points. I am for it.

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :- మొదట రాంబాబు ఇష్యూ అడిగి తరువాత సెకండ్ ఐటంగా తీసుకుంటే ఎవరు వద్దు అంటారు?

శ్రీ పి. నాగేశ్వరరావు :- వారు అంటే నాకు గౌరవం. They are not separate issues., as such... let him go on record. జనార్ధనరెడ్డి గారు నాకు మీతో వున్న పరిచయం ద్వారాను, వున్న గౌరవం, ఇంటిగ్రిటితోను చెబుతున్నాను. మేము వచ్చిన అగ్రిమెంట్ చెబితే వారికి ఈ డౌట్ వచ్చేది కాదు. మేము సపరేట్ చేయదలచుకోలేదు. చేయలేదు వాళ్లు హెజిటేట్ చేసి వారిది ముందు చర్చించాలని అన్నారు. అన్న తరువాత ఒక సభ్యుడు హర్ట్ అయ్యారు. దెబ్బ తగిలింది. ఆయన చెప్పిన తరువాత మీ ఇష్యూ అనే అంశం వున్నది. వారు చెప్పారు. మా అభిప్రాయం ఏమిటో మాకు వదిలిపెట్టండి. తరువాత అందరికి ఒక అభిప్రాయం వస్తుంది. They are not separate issues as such. I agrre with you.

**Sri N. Janardhana Reddy** :- When you are agree with it, why not you complete it and come to the other point.

**Sri P. Nageswara Rao** :- What has been agreed there, should be implemented here - otherwise there will be pandemonium and they will not allow the business of the House. We want to help you to transact the business of the House.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : జనార్ధన రెడ్డి గారు ...

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :- ఏమండీ, మీ మాత్రం ఎలా చెబుతారు? Then, why are you asking him to tell?

**Sri P. Nageswara Rao** :- Yes, it has been agreed there.. it has been agree there.

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :- యాక్సెప్ట్ చేశాము. మీకు, నాకు కోపం అవసరం లేదు.

శ్రీ మహమ్మద్ జానీ :- ఎంతసేపు ఆ అంశము మీదనే చర్చిస్తారు?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : జానీగారు దయచేసి కూర్చోండి.

**Sri Md. Jani** :- What is your opinion....

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : మీరు కూర్చోండి నేను చెప్పాను గదా.

**Sri P. Nageswara Rao** :- Sir, I did not complete, and if this is going to happen... జనార్ధనరెడ్డి గారు ఆందోళనను అర్థం చేసుకొన్నాను. కానీ ఆ అంశమును గురించి అందరు మాట్లాడాలని ప్రయత్నిస్తే ఒంటిగంటన్నర అవుతుంది. అందుకని ఈ రోజే చెప్పదలచుకొన్నాము.

10.50 ఉ. శ్రీ మహమ్మద్ రజాక్ ఆలీ (సుజాతనగర్) :- అధ్యక్షా, మీరు అయినా చెప్పాలి అక్కడ జరిగింది ఏమిటీ అనేది. బాపిరాజు గారు అయినా చెప్పాలి. సమరసింహారెడ్డి గారు అయినా చెప్పాలి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : సభ్యులకు తెలియనందు వల్ల కొంత కన్‌ఫ్యూజన్ వచ్చింది. అది చెబుతాను.

శ్రీ నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి :- పాయింట్ ఆఫ్ ఆర్డర్ సర్. It sets precedence గౌరవ సభ్యులు మాట్లాడిన దాని మీద మోటివ్స్ ఎట్రిబ్యూట్ చేస్తూ యింకొక సభ్యుడు మాట్లాడడం అనేది సభా సాంప్రదాయానికి విరుద్ధమని మనవి చేస్తున్నాను. ఫస్ట్ పాయింట్. రాంబాబు గారు నర్సిరెడ్డి గారు. మమ్ములను కొట్టారు, తన్నారు అని గౌరవ సభ్యులు ఎసర్ట్ చేసుకొని యీ సభలో చెబితే. మీరు చెప్పింది సత్యదూరము అని మోటివ్స్ ఎట్రిబ్యూట్ చేస్తూ, మీరుమంత్రి పదవులు కొరకు చెన్నారెడ్డి గారుచుట్టూ తిరగడానికి, మీరు యిక్కడ సత్యదూరమైన విషయాలు మిమ్ములను తప్పించుకున్నారని చెబుతున్నారు అంటూ ఒక గౌరవ సభ్యులు ఆరోపించడమంటే It is unwarranted, irrelevant and against conventions of the House. He is attributing motives to the Hon. Members. సెకండ్ పాయింటు. గౌరవసభ్యులు డాక్టరు గారు చెబుతూ నేను ఏదో, యీ కాంగ్రెస్ సభ్యులు ఎవరో అక్కడ ఎన్.టి. రామారావు గారి ఫోటోను తొలగించుచున్నట్లు, విమర్శించినట్లు తాను విన్నట్లుగా చెబుతున్నారు. విన్నట్లు అనేది అండర్‌లైన్ చేస్తున్నాను. మనము ఎవిడెన్స్ యాక్టును చదివాము. Hear say evidence is no evidence తమ అభిప్రాయాలు చెప్పాలి గాని ఎసెర్ట్ చేసుకోకుండా విన్నట్లుగా చెబుతున్నారు. లాస్ట్ పాయింట్. ఎందుకంటే నా మీద వ్యక్తిగతంలో, వ్యంగ్యంగా ఆరోపించారు. నాకు పశువుల శాఖ మైనస్ పాడి పరిశ్రమ యిచ్చి వుండవచ్చు. నేను భరిస్తాను అవమానము. కాని ఆ గౌరవ సభ్యుడిని ఎన్.టి. రామారావు గారు బయటకు కేబినెట్ నుంచి పూర్తిగా గెంటి వేశారు, కాదంటారా అని అడుగుతున్నాను. ఆయన దొడ్లో నుండి తరిమివేశారు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : అక్కడ వచ్చిన అండర్‌స్టాండింగ్ ఏమంటే...

పట్టు పరిశ్రమ, కామర్స్, ఎగుమతులు శాఖామంత్రి (శ్రీ మహమ్మద్ జానీ) :- అధ్యక్షా, ఐయామ్ ఆస్కింగ్ వన్ క్లారిఫికేషన్.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- నేను క్లారిఫై చేస్తాను, జానీ గారు దయచేసి కూర్చోండి.

శ్రీ మహమ్మద్ జానీ :- నాకు క్లారిఫికేషన్ అడిగే హక్కు లేదంటే నేను కూర్చుంటాను.

డా.కె. శివప్రసాదరావు :- కూర్చో ...

శ్రీ మహమ్మద్ జానీ :- (నీవు ఎవడివి చెప్పడానికి లేదని) I am asking the Chair. whether you are allowing me to get a clarification from the Chair.

**Mr. Dy. Speaker** : After I announced the business, I clarified about today's business. You will have an opportunity.

**Sri Mohd. Jani :-** On this particular issue, I am raising to seek a clarification.

**Mr. Dy. Speaker** : Your doubt may be solved after my announcement of today's business

**Sri Mohd. Jani** :- First you have to hear the doubt I have.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : నేను ఎనౌన్స్ చేసిన తరువాత చెబుతురు గాని యివాళ బిజినెస్ ఏమిటో - కొంత మార్పు చేశాము అందరితో మాట్లాడి, సభ్యులు ఎజిటేటెడ్‌గా వున్నారు - కన్‌ఫ్యూజన్ లేకుండా ముందు నన్ను ఎనౌన్స్ చేయనీయండి, తరువాత మీరు మాట్లాడండి. శివప్రసాద్‌గారు, మీరు లేని టాపిక్ చెబుతున్నారు, వారు అపార్థం చేసుకుంటున్నారు. బిజినెస్ ఎనౌన్స్ చేయండి, తరువాత చెబుదురు గాని. శ్రీనివాసులురెడ్డి గారు లేవదీసిన పాయింట్ ఆఫ్ ఆర్డరు గురించి - ఒక సభ్యుడి మీద జరిగిన ఎటాక్ గురించి రెండువ ఆయన ఒప్పుకోవడం లేదంటున్నారు అంటే that we will leave it to the wisdom of the respective Members and wisdom of the entire House. That is one thing. వారి పద్ధనలో విషయం ఏదో అవమానించారంటే That is not a point of order ఏదో వారి ధోరణిలో వారు చెబుతున్నారు. మీ ధోరణిలో మీరు చెబుతున్నారు. కాకపోతే సమయం, సందర్భానికి సంబంధించింది కాదు - ఇర్రెలవంట్ అనుకోండి. ఏదో చెప్పేటప్పుడు కొంత ఇర్రెలవంట్ అప్పుడప్పుడు వస్తూ వుంటుంది. అక్కడికి అది పోనీయండి. పీస్‌ఫుల్‌గా జరపడానికి అని చెప్పి. యివాళ క్వశ్చన్ అవర్ జరగకుండా మొదట రాంబాబు మీద జరిగిన ఎటాక్, వారిని సస్పెండు చేసిన విషయం రెండు ప్రక్కల వచ్చేసరికి, ఆల్ పార్టీస్ లీడర్సును పిలిచి నేను ఛాంబర్స్‌లో చర్చలు జరిపాను. ప్రభుత్వం తరుపున రోశయ్యగారు, నమరసింహారెడ్డి గారు, చీఫ్‌విప్ గారు వున్నారు. ఆల్ పార్టీస్ లీడర్స్ వున్నారు. చర్చించిన తరువాత వచ్చిన అండర్‌స్టాండింగ్ ఏమంటే, ప్రస్తుతానికి క్వశ్చన్ అవర్‌ను పోస్ట్‌పోన్ చేసి It is an extraordinary thing. We have postponed the question hour with the consent of leaders of all parties. క్వశ్చన్ అవర్ పోస్ట్‌పోన్ చేసి రాంబాబు గారి ఊండెడ్ గాబట్టి వారి ఫీలింగ్స్ ఏవో చెప్పడానికి యున్సిడెంటు చెప్పడానికి ముందు అవకాశం యివ్వడం, అది ఫైనల్‌చర్య అనో ఇప్పటికిప్పుడే మొత్తం సాల్వ్ అయిపోయిందని కాదు. రాత్రి యింజ్యూరీ జరిగింది గాబట్టి ముందు వారిని వినాలి, తరువాత వారు 304 క్రింద నోటీసులు యిచ్చారు. దాని మీద యింకా అదనంగా అవసరం అనుకుంటే యింకొకసారి చర్చించవచ్చు. ముందు వారిని విని, తరువాత లార్జ్ నెంబరు ఆఫ్ మెంబర్స్ సస్పెండు అయినారని చెప్పి వారు బజార్లో వున్నారు, వారి సంగతి ఏమిటీ అంటే అది కూడా విందాము. ముందు యిది విని, తరువాత అది విని, రెండు కంక్లైన్స్‌గా విని తరువాత వరుసగా లీడర్సు ఒపీనియన్ చెబుతారు, ప్రభుత్వం నుండి రిప్లయి వస్తుంది. తరువాత నా ఒపీనియన్ నేను చెబుతాను. నేను యిచ్చేరూలింగు యిస్తాను. అది అనుకున్నాము.

అది అయిన తరువాత తక్కిన బిజినెస్‌కు వెడుదాం అనుకున్నాము. అందుచేత జనార్ధనరెడ్డి గారికి డౌట్ రావడములో అర్థం ఉంది.

**Sri N. Janardhana Reddy** :- Kindly hear me. No opposition leader is going to support that attack. You could have come to some agreement. That is not final. You can always change. You can ask....

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ఛేంజ్ అంటే కాంప్లికేషన్సు వస్తాయి.

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :- అధ్యక్షా, మా కంటే తమరు ఎక్కువగా మాట్లాడుతున్నారు. నన్ను ఒకసారి మాట్లాడనివ్వండి. రాంబాబు, నర్సిరెడ్డి గార్ల మీద జరిగినట్లువంటి ఎటాక్‌కు సంబంధించి ఆల్ పార్టీస్ అభిప్రాయాలు తెలుసుకొని, హౌస్‌లో యునానిమస్‌గా దాని గురించి తెలుసుకొని, మీ అభిప్రాయం యిచ్చిన తరువాత, అప్పుడు మాట్లాడనివ్వండి. అది కూడా I only want them to speak. I want a ruling on that.

డా. కె. శివప్రసాదరావు :- అధ్యక్షా, తమరితో మాట్లాడినప్పుడు రెండు కలిపి మాట్లాడుకుందామని చెప్పారు

శ్రీ యం. ఓంకార్ :- అధ్యక్షా ....

శ్రీ ఎన్. జనార్ధన రెడ్డి :- మేమంతా ఇంతమందిమి ఉంటే యిద్దరికి అంటే, అక్కడ ఒక్క ఎం.ఎల్.ఏ. ఒక లీడరు. ఏమి లీడర్సండి.

**Sri Mohd. Jani** :- You give a ruling on that.

**Mr. Dy. Speaker** : What do you want?

శ్రీ మహమ్మద్ జానీ :- అధ్యక్షా, ఎం.ఎల్.ఏపైన దాడి అనేది చాలా సీరియస్ విషయం. ఈ హౌస్‌లో ప్రతి ఒక్క మెంబరుకు సంబంధించింది. వారి అభిప్రాయము మీ ముందు పెట్టడం జరిగింది. దాని మీద హౌస్ ఒపీనియన్ తెలుసుకోకుండా యింకొక సబ్జెక్ట్‌ను చర్చించడమనేది సబబు అయినది కాదు, సాంప్రదాయమైనది కాదని నా భావము. దీని మీద మీ అభిప్రాయం చెప్పాలి. దాని మీద క్లారిఫై చేయాలని నా విజ్ఞప్తి. రూలింగు యివ్వండి, మీ ఒపీనియన్ చెప్పండి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ఇది ఫస్ట్ ఐటమ్ గాను నిన్నటి సస్పెన్షన్ విషయము సెకండ్ ఐటమ్ గాను కలిపి డిస్కషను జరిగిన తరువాత, ప్రభుత్వం నుండి రిప్లయి వచ్చిన తరువాత...

శ్రీ మహమ్మద్ జానీ :- కలిపి ఎట్లా తీసుకుంటారు? కలిపి తీసుకోడానికి వీలులేదు అలాంటి సాంప్రదాయం లేదు యీ హౌస్‌లో. రెండు యిస్యూస్ కలిపి చర్చించే సాంప్రదాయం యీ హౌస్‌లో లేదు. ఆ యిష్యూ వేరు. ఈ యీష్యూ వేరు. ఆ యిష్యూను కూడ చర్చించడానికి సిద్ధంగా వున్నాము.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : చేయవచ్చు, యిబ్బంది లేదు.

శ్రీ మహమ్మద్ జానీ :- ఎట్లా ?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : చేయవచ్చు, ఏమీ యిబ్బంది లేదు.

శ్రీ మహమ్మద్ జానీ :- భిన్నమైన దృక్పథం కలిగిన రెండు యిష్యూలను కలిపి డిస్కస్ చేస్తే నిర్ణయం ఏమి వస్తుందో మీకు బాగా తెలుసు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ఏమీ పర్వాలేదు. మంచి నిర్ణయాలే వస్తాయి. మీరు డౌట్ పడవలసిన అవసరం లేదు. దయచేసి కూర్చోండి.

శ్రీ మహమ్మద్ జానీ :- మీరు దానిని ఆ విధంగా భావిస్తే - మీ మీద వున్న గౌరవం కొద్దీ కూర్చుంటాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : రాంబాబు యిష్యూ మీద పూర్తి చర్చ జరుగుతుంది. మీకెమి డౌట్ అక్కరలేదు. నిన్నటి సంఘటన విషయము కూడ తీసుకోకపోతే అన్యాయం చేశామనే అపోహ వుండవచ్చు. అది కూడ వినాలి మనము - అల్టిమేట్ కంక్లూజన్‌కు రావాలని - ప్రభుత్వ రిప్రజంటేటివ్స్ వుండగానే అండర్‌స్టాండింగ్‌కు వచ్చాము. దయచేసి అందరు ఆమోదించాలి.

డాక్టర్ ఎమ్.వి. మైసూరారెడ్డి (కమలాపురము) :- పాయింట్ ఆఫ్ ఆర్డర్ సర్.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : లేదు. ఈ పాయింట్ ఆఫ్ ఆర్డర్స్‌తోనే టైమంతా పోనీయకండి. ఆ అండర్‌స్టాండింగ్‌తో నడవనీయండి.

11.00 ఉ. డాక్టర్ ఎమ్.వి. మైసూరారెడ్డి :- అధ్యక్షా, పాయింట్ ఆఫ్ ఆర్డర్. తమరి ఛాంబర్సులో తమరు, మంత్రులు, ప్రతిపక్ష నాయకులు కూర్చొని మీటింగ్ జరుపుతున్నప్పుడు నేను వచ్చి ఇట్లాగ రాంబాబు గారి మీద హాస్టలులో ఎటాక్ జరిగిందని, ఇక్కడ ఆయన స్లోగన్సు ఇచ్చారనే ఉద్దేశంతో ఆయనను హాస్టలులో కొట్టారని చెప్పి తీసుకొని వచ్చి చెప్పడం జరిగింది. సస్పెండు చేసిన శాసనసభ్యుల విషయం ఇక్కడ చర్చించడానికి పాండిమోనియం జరిగితే వారిని చర్చలకు మీ ఛాంబర్సుకు పిలిపించారు. ఆ చర్చలు జరుగుతున్న సమయంలో నేను వచ్చి రాంబాబు గారిని ఇక్కడ స్లోగన్సు ఇచ్చారని హాస్టల్సులో కొట్టారని చెప్పి రాంబాబు గారిని తీసుకొని వచ్చిన తరువాత రాంబాబు గారి విషయం కూడ చర్చ జరగాలని ప్రతిపక్ష నాయకులు, అక్కడున్నటువంటి మంత్రులు, మీరు నిర్ణయం తీసుకున్నారు. ఒక శాసనసభ్యుని మీద ఎటాక్ జరిగింది కనుక ఆయన సెపరేట్‌గా చర్చించండి. మీరు నిర్ణయం తీసుకొని ఉండవచ్చు. ఆయనది సెపరేట్‌గా చర్చించండి. వీరిది సెపరేట్‌గా చర్చించండని నేను విన్నపం చేస్తున్నాను. నిన్న సస్పెండ్ అయిన శాసనసభ్యుల విషయం గురించి ఇక్కడ ప్రశ్నోత్తరాల ముందు లేవనెత్తితే దానిని గురించి చర్చించుటకు మీరు ప్రతిపక్షాల వారిని మీ ఛాంబర్సులోకి పిలిపించారు. అక్కడికి రాంబాబుగారిని నేను తీసుకొని వచ్చి రాంబాబు గారు దెబ్బలు తిన్నారు. ఆయన విషయం గురించి చర్చించాలని చెప్పడం జరిగింది. రాంబాబు గారు దెబ్బలు తిన్నప్పుడు ఆయనను విడిపించడానికి శ్రీనర్సిరెడ్డి గారు పోతే శ్రీ నర్సిరెడ్డి గారిని కూడా కొట్టడం జరిగిందని ఆయనకు కూడా అవకాశం ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ఈ సమస్యను ప్రత్యేకంగా చర్చించాలని కోరుతున్నాను. ఇది శాసనసభ ప్రతిష్టకు సంబంధించింది కనుక ఇది సెపరేట్‌గా చర్చించాలని మనవి చేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : రాంబాబు గారి మీద జరిగిన ఎటాక్ గురించి This is not the final discussion. వారు వెంటనే ఏమి చెబుతారో వినాలనే ఆదుర్దాతో దానికి ప్రయారిటీ ఇచ్చాము. ఈ విషయం గురించి 304 నోటీసు ఇచ్చారు. మరోసారి దాని వివరాలు ఇంకా కొన్ని బైటకు వచ్చిన తరువాత మనం చర్చించుకోవచ్చు. వారు మెన్షను చేయడానికి, సభ నోటీసుకు ఫ్యాక్ట్సు తేవడానికి అవకాశం ఇచ్చాము ఈవేళ అంతే తప్ప దానిని అండర్‌మైన్ చేయడం కాదు, దానిని కన్‌ఫ్యూజ్ చేయడం కాదు. దానికి తక్కువ విలువ ఇవ్వడం లేదని చెబుతున్నాను.

**Sri N. Janardhana Reddy** :- Then, you should not have allowed Mr. K. Sivaprasada Rao to mention abut it. If you wanted to hear only Mr. Rambabu, you should not have allowed him to mention about suspension. You mixed these these things and other opposition parties wanted to mention about it. మా కంటే తమరు అక్కడ కూర్చొని దీనిని గురించి సీరియస్‌గా ఆలోచనచేయాలి.

**Mr. Dy. Speaker** : No doubt, it is most serious one for everyone.

**Sri N. Janaradhan Reddy** :- you have stated that you are going to give a ruling. If you want to hear the Leaders of Opposition, first hear about the attack and give a ruling. Now you are againg telling that you are postponing it.

**Mr. Dy. Speaker** :- Prima facie, we have to hear it first.

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :- ఆయన ముఖం అంత పగిలిపోయి ఉంటే ప్రయిమాఫేసీ ఏమిటి?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ :- అందుకనే దానికి అవకాశం ఇచ్చింది.

(ఇంటరప్షన్స్)

శ్రీ సిహెచ్. విద్యాసాగరరావు :- అధ్యక్షా, నిన్న మీరు సస్పెండు చేసిన 54 మంది విషయం మీద చర్చ చేద్దామని అనుకున్నాము. ఆ అంశం మీదనే మీరు సభను వాయిదా వేసారు. వాయిదా వేసిన తరువాత మీ ఛాంబర్సులో కూర్చోబెట్టి అందరితో మాట్లాడారు. ఒక అగ్రిమెంటుకు వచ్చాము. గౌరవనీయులైన శ్రీ రోశయ్యగారు ఎప్పుడూ మాట్లాడేవారు, ఎందుకోగాని వారు ఇప్పుడు మాట్లాడడం లేదు. వారు కూడా ఉన్నారు. తోటి శాసనసభ్యుడు ఏ అమానుషానికి గురి అయినాడో ఆయనకు మొదట అవకాశ ఇద్దాము, ఇచ్చిన తరువాత మిగిలిన చర్చను కొనసాగిద్దామనే అభిప్రాయానికి మనం వచ్చాము. బైటకు వచ్చిన తరువాత పదేపదే బి.ఎసి.లో ఏమి అయినందనే విషయం చర్చించనవసరం లేదు. పాలకవర్గానికి చెందిన మంత్రులు కాని మిగిలిన సభ్యులు కాని ఈ విధంగా మిమ్ముల‌ను ధిక్కరిస్తూ మాట్లాడడమే కాని మీ అభిప్రాయాలకు భిన్నంగా మాట్లాడడం కాని సరైన పద్ధతి కాదు. దయచేసి ఆ చర్చ ముగిసింది. ఆ సభ్యునికి మళ్లీ ఒకసారి 304 ఎలా చేయండి, తీవ్రంగా

అందరం ఖండిస్తాము. ఇప్పుడు మాత్రం నిన్న మీరు సస్పెండ్ చేసిన శాసనసభ్యుల గురించి చర్చ ఎలా చేయండి. ఎలా చేసిన తరువాత సాల్వ్ అయిపోతుంది. ఇది మనం అనుకున్నాము.

(ఇంటరప్షన్స్)

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డిగారు కూడా అన్నారు. మా అభిప్రాయాలు తీసుకుంటే మంచిదని అన్నారు. వారి మాట నేను కాదనడం లేదు. ఒకఅప్రహెన్షన్ ఏమిటంటే మా అభిప్రాయాలు తీసుకున్న తరువాత అది చర్చ చేయండి, తరువాత ఎవరైతే రోడ్డు మీద సత్యాగ్రహం చేస్తున్నారో ఆ శాసనసభ్యుల గురించి చర్చించే అవకాశాన్ని మిమ్ములను కల్పించకుండా చేస్తారనే భయం ఉంది.

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :- ఐ ఎస్యూర్ యు. అటువంటి దురుద్దేశాలు మా వాళ్లకు లేవు.

శ్రీ సిహెచ్. విద్యాసాగరరావు :- ఆ చర్చ ముగిసింది. ఇప్పుడు దీనిని గురించి మాట్లాడితే బాగుంటుంది.. సస్పెండు అయిన శాసనసభ్యుల గురించి మాట్లాడడానికి శ్రీకోడెల శివప్రసాదరావు గారిని మీరు అనుమతించండి.

(ఇంటరప్షన్స్)

శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి :- అధ్యక్షా, శ్రీ విద్యాసాగర రావు గారు చెప్పినట్లు మీరు ఆ సబ్జక్ట్ తెలుసుకుంటే మాకు ఆక్షేపణ లేదు కాని ఆయన గురించి మెన్షను చేసిన తరువాత దాని మీద ప్రతిపక్షం వారు మా అభిప్రాయం లేదు, మేము ఖండించము అని అంటే మీరు ప్రొసీడ్‌కండి, మాకు ఏమి అబ్జక్షను లేదు.

(ఇంటరప్షన్స్)

శ్రీ కె. బాపిరాజు :- అధ్యక్షా, బి.ఎసి.లో అపోజిషను లీడర్సు, మీరు, మేము అందరం కలిసి కూర్చొని మాట్లాడాము. ఇప్పుడు శ్రీ ఎన్. జనార్ధనరెడ్డి గారు ఒక సలహా ఇచ్చారు. ఒక శాసనసభ్యుడు హర్టు అయినప్పుడు మనం పూర్వం ఏ సమస్య మాట్లాడుకోవాలని అనుకున్నప్పటికి ఆ పరిస్థితి మన దృష్టికి వచ్చినప్పుడు దానికి ప్రయారిటీ ఎలాగ ఇచ్చామో అదే పద్ధతిలో ఈ డిస్కషను జరిగిన తరువాత శాసనసభ్యుడిని కాబట్టి ఇన్సిడెంట్‌కు ప్రయారిటీ ఇచ్చి, సీరియస్‌నెస్ ఇచ్చి ఇది మొత్తం శాసనసభ్యుల వ్యవహారానికి సంబంధించింది కనుక can we not have a word about it and then finish it? ఇది చాలా చక్కటి సలహా. ఇటువంటి ఇష్యూస్ వచ్చినప్పుడు ఆ ఇష్యూల మీద క్లారిఫికేషన్సు కావాలని అంటే ఎప్పుడూ ఇచ్చే సాంప్రదాయం మనకు ఉంది. ఇది ప్రయారిటీ కాదా? ఒకసారి ఆ గదిలో అనుకున్నాము కనుక మీరు అది చేస్తారా, చేయరా అని శ్రీ నాగేశ్వరరావు గారు దయచేసి ఖండించవద్దు. మొన్న మనం క్వశ్చన్ అవర్‌లో ఏ క్వశ్చన్‌కూ 5 నిమిషాల కన్నా ఎక్కువ ఉండకూడదని నిర్ణయించుకున్నాము. అయినా 15 నిముషాలు మాట్లాడాము. మొన్న కృష్ణా వాటర్స్ విషయంలో 15 నిముషముల కన్నా ఎక్కువ ఎవరూ మాట్లాడకూడదని అనుకున్నాము. అయినా శ్రీ విద్యాసాగరరావు గారు అరగంట సేపు మాట్లాడారు. దానికి మేము బాధపడడం లేదు. ఫ్లెక్సిబుల్‌గా ఉండాలి. ఏదీ కూడా ప్రెషర్ మీద కాకుండా కన్వీనియంటుగా రిక్వెస్టు మీద చేయాలి. I feel that it is very

valuable suggestion given by the Hon. Minister. శ్రీ విద్యాసాగరరావు గారు ప్రక్కవారితో చెబుతూ దానికేమి ఉంది, మంచిదని సలహా ఇచ్చినట్లు నేను భావించాను. నా భావం తప్పు అయి ఉండవచ్చు. కాని నేను భావించాను. మీరు ఎన్ని చెప్పినప్పటికి స్పీకరు గారి డిస్క్రిషను కూడా అనుకున్నాము. I appeal to the Chair kindly to give importance to the hurt legslator. దాని గురించి ఆల్టర్‌నేటివ్‌గా మనం విషయాలు మాట్లాడుకుందాము. తప్పదు నాగేశ్వరరావు గారు.

11.10 శ్రీ ఎ. వీరప్ప :- అధ్యక్షా...

ఉ. మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :- బాపిరాజు గారు, వీరప్పగారు దయచేసి కూర్చోండి. రాంబాబు గారి మీద ఎటాక్ విషయంలో It is most serious one and gets par amount importance. That is why, we have given precedence for mentioning it and for expressing the facts and feelings. That does not mean that everything is over. Regarding that a notice under Rule 304 is there. If necessary, further discussion can be allowed on that. Along with it, on the second item, regarding suspension, we have agreed. Unnecessarily, it will give some complication. We have already gone to some extent in that direction. Please convince your Members regarding that.

(చాలామంది సభ్యులు లేచారు)

**Sri K. Bapiraju** :- I don't want any discussion. ఫ్లోరు లీడర్సు యొక్క ఒపినియన్ ఈ ఇన్‌స్టెన్సు గురించే చెప్పమనండి. It will take ten seconds for each Opposition Leader to give his position. 10 సెకండ్స్‌కు మించి మాట్లాడడానికి లేదు. దయచేసి వారి ఒపీనియన్స్ 10 సెకండ్లలో చెప్పమనండి. I want the floor leaders to come out and give their opinion in a few seconds.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- అధ్యక్షా, తమ సమక్షములో ఏదైతే అంగీకరించి వచ్చామో -- ఆ పరిధి నుంచి మించి మాట్లాడడం లేదు. అదే విధంగా గౌరవ సభ్యునికి శారీరకమైన గాయాలు తగిలినప్పుడు యిక్కడ ఉండే మొత్తం సభ్యులము ఖండిస్తున్నాము. పార్టీరహితంగా అందరం ఖండిస్తున్నాము. అదే విధంగా నిన్న సస్పెండు అయిన 54 మంది శాసనసభ్యులు బాధాతప్త హృదయాలతో రక్షణ జరగలేదనే బాధతో నడిబజారులో అనాధలుగా ఉన్న వారి పట్ల సానుభూతిని మనం తెలుపవలసినది పోయి ఈ సమస్య చర్చించకూడదని మంత్రిగారు చెప్పడం మంచిది కాదని మనవి చేస్తున్నాను.

(కాంగ్రెస్ సభ్యులు అంతరాయం కలిగించారు)

నిన్నటి రోజున జరిగినటువంటి సస్పెన్షను కార్యక్రమాల విషయంలో

**Mr. Dy. Speaker** :- The Legislative Affairs Minister has to use his good offices. నిముష నిముషానికి ముఖ్యమంత్రి గారి చాంబరుకు యిక్కడ సంబంధించిన మంత్రులు పోయి ....

(Interruptions)

Please resume your seats. వారి ఆదేశాలు తీసుకుని వచ్చి వారి ఆదేశాలు ప్రకారమే సస్పెన్షను కార్యక్రమాన్ని యిక్కడ అమలు జరిపారు. అంతేకాదు.

(కాంగ్రెస్-ఐ గౌ॥ సభ్యులు లేచారు)

శ్రీ పి. నాగేశ్వరరావు :- ధైర్యము ఉంటే మీరు వారిని సస్పెండు చేయండి. నిన్న వీరిని చేశారు కదా వారి వారి ఇంట్రనల్ గ్రూపులకు జోలికిపోను...

(చాలామంది కాంగ్రెస్ సభ్యులు లేచారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :- దయచేసి అంతా కూర్చోండి.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- నిన్న జరిగినటువంటి సస్పెన్షన్ కార్యక్రమం ముఖ్యమంత్రిగారి కుమారులు శశిధర్ రెడ్డి గారు ముఖ్యమంత్రి గారి గదిలోంచి నిముష నిముషానికి యిచ్చినటువంటి ఆదేశాలకు అనుకూలంగా వారు యిచ్చిన ఆదేశాల మేరకు వారు కోరిన మేరకు జరిగిందని మనవి చేస్తున్నాను దీనిని గౌరవ సభ్యులందరూ ఖండించవలసిన అవసరం ఉంది. శాసనసభాముఖంగా ఖండిస్తున్నాను.

(కాంగ్రెస్ సభ్యులు లేచారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :- అది చెప్పారు. అభ్యంతరం లేదు. అదే రిపీట్ చేస్తున్నారు.

డాక్టర్ కె. శివప్రసాదరావు :- వినిపించడం లేదు. అందుకని రిపీట్ చేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీకి 100 ఏండ్ల చరిత్ర ఉందని చెప్పారు. పార్టీలో అనుభవం గలవారు, మంత్రులు ఉన్నారు. ఎంతమంది ఉన్నప్పటికి చెన్నారెడ్డి గారి కుమారుడు ఏమి చెబితే అది విని ఈ ప్రభుత్వం అమలు జరపడం అనేది చాలా దురదృష్టకరం. అధ్యక్షా. 22వ తేదీన మాజీ ప్రధాని ..

(చాలామంది కాంగ్రెస్ సభ్యులు లేచారు)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్ :- శివప్రసాదరావు గారు మీరు కేవలం ప్రొవోక్ చేసి హరికథ చెబుతున్నారు. నిన్నటి సస్పెన్షన్ లోనికి పోవడం లేదు. వారు టాలరేట్ చేయడం లెదు. ఎట్లాగు సభ నడిచేది ...

(పోడియం వైపుకు శ్రీ పి. ఇంద్రారెడ్డి, శ్రీ బి. గోపాలకృష్ణరెడ్డి మొదలైన నలుగురైదుగురు తెలుగుదేశం పార్టీ గౌ॥ సభ్యులు దూసుకుని వెళ్ళి అధ్యక్షస్థానము చుట్టూ నిల్చున్నారు)

**Mr. Dy. Speaker :-** Please go to your seats. Please resume seats. All of you please go to your seats. No mike to anybody including Siva Prasada Rao. నిన్నటి రోజున సభలో సస్పెన్షను విషయంలో ఇండివిడ్యువల్ గా నేమ్ చేయలేదని అంటున్నారు. ఇండివిడ్యుయల్‌గా నేమ్ చేయాలనేది అది మనిషిని ఐడెంటిఫై చేయడానికి తప్పవ - మోర్ దేన్ ఒన్ మేన్ ఉన్నప్పుడు ఫలానా వారని చెప్పి ఐడింటిఫై చేసి

స్పెసిపై చేసినప్పుడు It is quite correct and all the TDP Members who were present in the House నిన్న అన్నారు. The suspension is quite valid. It is correctly identified and it applied to the Members then. Therefore, the suspension is quite valid according to the rules. అది ఎవరో ప్రేరేపిస్తేనో. ముఖ్యమంత్రి గారి కొడుకు చెప్పారని చేసిన ఆరోపణలు బేస్‌లెస్ మానిషష్ అని నేను ఛైరు నుంచి కండెమ్ చేయదలచుకున్నాను. నా ఛాంబరులో గాని, మరెక్కడా కాని శశిధర్ రెడ్డి గారు రాలేదు. కనపడలేదు, ఇన్‌స్ట్రక్షన్స్ యివ్వలేదు. సభలో లేని వారి మీద యిటువంటి నిందలు. ఆరోపణలు చేయడం భావ్యం కాదని మనవి చేస్తున్నాను పర్‌సిస్టెంట్‌గా హౌస్‌ను రన్ చేయకుండా గంటల కొలది యిబ్బందులు కలగచేయడం వలన కఠినమైన చర్యలు తీసుకోవలసి వచ్చింది. యిది చాలా బాధాకరమైన విషయం. తప్పనిసరిగా చర్యలు తీసుకోవలసి వచ్చింది. యికనైనా సభ్యులు .... I hope wisdom will prevail. I hope the spirit of democracy will prevail and they will conduct themselves in a better way and try to improve the democracy in the State. I hope they will solve the problems of the people in the State.

Now, the House is adjourned sine die

(The House then adjourned at 11.17 A.M. sine die)

## అనుబంధము

## నక్షత్రము గుర్తుగల ప్రశ్నలు - వ్రాతపూర్వక సమాధానములు

### మిరాసీదార్లు హిందూ దేవాదాయ ధర్మాదాయ చట్టాన్ని సవాలు చేయుట

57 -

*1706-(ఎక్స్)- సర్వశ్రీ ఎం. రఘుమారెడ్డి, డి. వీరభద్రరావు :- దేవాదాయశాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) 1987, హిందూ దేవాదాయ, ధర్మాదాయ చట్టపు చెల్లుబాటును సవాలు చేస్తూ మిరాసీదార్లు అత్యున్నత న్యాయస్థానంలో కేసు దాఖలు చేసిన విషయం వాస్తవమేనా :

(ఆ) అయినచో, సదరు చట్టాన్ని ఏ అంశాలపై సవాలు చేయటం జరిగింది :

(ఇ) సదరు 1987 చట్టానికి సవరణలు తీసుకురావడానికి ప్రభుత్వం యోచించినదా?

(అ) అవునండీ

(ఆ) మిరాసిదారులు, 1987, ఆంధ్రప్రదేశ్ ధర్మాదాయ, హిందూ మత సంస్థలు,

దేవాదాయాల చట్టంలోని 18, 34, 35, 36, 37, 40 ,42, 76, 142, 144, 155, 160 విభాగాల క్రింది నిబంధనలను సవాలు చేశారు.

(ఇ) 1987, ఆంధ్రప్రదేశ్ ధర్మాదాయ, హిందూమతసంస్థలు, దేవదాయాల చట్టానికి కొన్ని సరవణలను ప్రవేశపెట్టే ప్రతిపాదనను ప్రభుత్వం చురుకుగా పరిశీలిస్తున్నది.

### సహకార జూనియర్ కళాశాలల రద్దు

59-

*618 - సర్వశ్రీ బి. జనార్ధన్, డి. శివరామరాజు, కె. లక్ష్మీనారాయణ, సిహెచ్ జయరాంబాబు :- ఉన్నత విద్యాశాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) రాష్ట్రంలో సహకార జూనియర్ కళాశాలలను రద్దు చేసే ప్రతిపాదన ఏదైనా వున్నదా ;

(ఆ) అయినచో, అందుకు కారణాలెవ్వి ?

(అ) లేదండీ.

(ఆ) ఈ ప్రశ్నకు తావులేదు.

### కరీంనగర్ జిల్లాలో అత్యంత మేలిరకపు వరిధాన్యం కొనుగోలు

60-

*2577 - సర్వ శ్రీ సి. నర్సిరెడ్డి, కె. రామచందర్ రావు :- పౌర సరఫరాల శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) కరీంనగర్ జిల్లాలో , 1990 మే నెలలో ఎఫ్.సి.ఐ. అత్యంత మేలిరకపు వరిధాన్యాన్ని అతి తక్కువ ధరకు కొనుగోలు చేసిన విషయం వాస్తవమేనా ?

(ఆ) అయినచో, అందుకు కారణాలెవ్వి?

(అ) లేదండీ.

(ఆ) ఈ ప్రశ్నకు తావులేదు.

### వరంగల్లు సహకార కేంద్ర బ్యాంకులో అవకతవకలపై విచారణ

61-

*2749 - సర్వశ్రీ వి. వెంకటేశ్వరరావు, పి. రామయ్య, ఎస్. రాఘవరెడ్డి, కుంజ బొజ్జి,

డి. రాజగోపాల్ :- సహకార శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో జరిగిన అవకతవకలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించిందా :

(ఆ) ఆ నివేదిక ప్రతిని సభాసమక్షంలో ఉంచుతారా;

(ఇ) అవకతవకలకు బాధ్యులైన వ్యక్తులపై తీసుకున్న చర్య ఏమి?

.

(అ) (ఆ) (ఇ) :- వరంగల్లు జిల్లా కేంద్రబ్యాంకు నరసంపేట బ్రాంచిలో కొన్ని అవకతవకలు జరిగినట్లు ఆరోపిస్తూ పిటీషన్ అందిన మీదట, ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టంలోని 5వ విభాగం క్రింద సహకార సంఘాల రిజిష్ట్రారు విచారణకు ఆదేశించారు. విచారణ పూర్తి కావలసి వుంది. విచారణ నివేదిక అందిన వెంటనే ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల చట్టంలోని నిబంధనల క్రింద తగిన చర్య తీసుకొవటం జరుగుతుంది.

## సెట్విన్ బస్సులలో అతిజన సమ్మర్ధం

62-

*344 - సర్వశ్రీ పి. రాజం, పి. జనార్ధనరెడ్డి, కె. ప్రభాకరరావు :- ఆర్థిక, రవాణా శాఖా మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) హైదరాబాద్ - సికిందరాబాద్ జంటనగరాలలో సెట్విన్ బస్సులు వాటి యొక్క ప్రయాణీకులకు తీసుకువెళ్లే సామర్థ్యానికి మించి అనుపాతరహితంగా ప్రయాణీకులను తీసుకువెడుతున్న విషయం వాస్తవమేనా ;

(ఆ) అయినచో, ప్రభుత్వం, అవసరమైతే బస్సుల సంఖ్యను పెంచి, ఆ పథకం క్రింద సంకల్పించిన విధంగా ప్రయాణీకులను కనిష్ఠ సంఖ్యకు పరిమితం చేయడానికి ప్రభుత్వం యోచిస్తుందా ;

(ఇ) అతి జన సమ్మర్ధం వల్ల ఏవైనా ప్రమాదాలు సంభవించాయా ?

(అ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులు, సెట్విన్‌కు సంబంధించిన బస్సులు అన్నీ హైదరాబాదు, సికిందరాబాదు జంటనగరాలలొ ప్రయాణీకుల కార్యాలయాలకు, కళాశాలలకు, కోర్టులు మొదలైన చోట్లకు వెళ్లడానికి రద్దీగా ఉండే సమయాలలో బస్సులు ఎక్కడానికి ప్రయత్నిస్తుండడం వల్ల బస్సులలో రద్దీ ఎక్కువ అవుతున్నది.

(ఆ) ప్రత్యేకంగా జంటనగరాలలో పథకం క్రింద ఉద్దేశించినట్లుగా ప్రయాణీకులను పరిమితం చేయడానికి వీలుపడదు. జంటనగరాలలో పెరిగే ప్రయాణీకుల రద్దీని తట్టుకోవడానికి ప్రతి సంవత్సరం సుమారు 100 కొత్త బస్సులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రవేశపెడుతున్నది.

(ఇ) కిక్కిరిసిన ప్రయాణీకులతో బస్సులు నడపటం వల్ల జంటనగరాలలో 1989వ సంవత్సరంలో ప్రమాదాలేవి జరుగలేదు.

జంటనగరాలలో ట్రాములు

63-

*390-సర్వశ్రీ జి.ఎస్.ఎస్. శివాజి, కె. ఎర్రన్నాయుడు :- ఆర్థిక మరియు రవాణా శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) హైదరాబాద్ - సికిందరాబాద్ జంటనగరాలలో ప్రయాణీకుల అవసరాలను తీర్చేందుకు ట్రాములను ప్రవేశపెట్టే ప్రతిపాదన ఏదైనా వున్నదా :

(ఆ) అయినచో , వాటిని ఎప్పటికి ప్రవేశపెడతారు;

(అ) లేదండీ.

(ఆ) ఈ ప్రశ్నకు తావులేదు.

సంకర రకం కొబ్బరి మొక్కలు

64-

*2101 - శ్రీ ఎస్. సత్యనారాయణరావు :- వ్యవసాయశాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా ;

(అ) తుఫానులకు తట్టుకొనడానికై కోస్తా జిల్లాలలో సంకర పొట్టిరకం కొబ్బరి మొక్కలను ప్రవేశపెట్టే ప్రతిపాదన ఏదైనా వున్నదా ?

(ఆ) అయినచో, సదరు రకానికి సంబంధించిన వివరాలెవ్వి ?

(అ) కోస్తా ప్రాంతాలలో తుఫాన్లను తట్టుకునే ప్రత్యేకరకం హైబ్రిడ్ కొబ్బరి మొక్కలను ప్రవేశపెట్టే ప్రతిపాదన ఏదీ ప్రస్తుతం లేదండీ.

(ఆ) ఈ ప్రశ్నకు తావు లేదు.

మేడ్చల్‌లో ఎం.ఐ.జి / ఎల్.ఐ.జి. / ఇ. డబ్ల్యు.ఎస్. గృహాల కేటాయింపు

65-

*1563 - సర్వశ్రీ పిహెచ్. విద్యాసాగరరావు, వి. బాల్‌రెడ్డి :- గృహ నిర్మాణ, చిన్న తరహా నీటిపారుదల, గనుల శాఖా మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) రంగారెడ్డి జిల్లా, మేడ్చల్‌లో నిర్మించిన ఎం.ఐ.జి. ఎల్.ఐ.జి., మరియు

ఇ డబ్ల్యు ఎస్. గృహాలను 21-1-1990 తేదీన బ్యాలెట్ ద్వారా చేసిన కేటాయింపు గూర్చి ఏవైనా ఫిర్యాదులు వచ్చినవా .

(ఆ) కేటాయింపుదార్లలో చాలమంది ధనవంతులు, ఇతర చోట్ల యిండ్లు కల్గిన వారు అయిన విషయం వాస్తవమేనా.

(ఇ) కేటాయింపు విధానాన్ని గూర్చి ఇతర చోట్ల యిండ్ల స్వంతదారులైనచో అట్టి కేటాయింపుదార్లను గూర్చి ఏదైనా విచారణను ఆదేశించుటకు ప్రభుత్వం యోచిస్తున్నారా ?

(అ) అవునండీ. ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ మండలి ఇండ్లను కేటాయించింది.

(ఆ) దరఖాస్తుదారు సొంత ఇంటిదారు అయినది లేదా సంపన్నుడయిన వ్యక్తి అన్న విషయం ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ మండలికి తెలియదు. వారు సమర్పించిన "ఇల్లు లేదనే ధృవపత్రం" ఆధారంగా దరఖాస్తులను పరిశీలించడం జరిగింది.

(ఇ) తదుపరి చర్యను తీసుకునే నిమిత్తం, అవకతవకల వివరాలను. అక్రమంగా ఇండ్లు కేటాయింపు పొందిన వ్యక్తుల వివరాలను సమర్పించాలన్న ఫిర్యాదుదారు అయిన మానవహక్కు సంఖం కన్వీనరును 2-2-90 తేదీ లేఖలో ఆంధ్రప్రదేశ్ గృహనిర్మాణ మండలి కోరింది అయితే వివరాలతొ ఆయన ఇంతవరకు ముందుకు రాలేదు

గిరిజనుల కోసం వసతిగృహాల నిర్మాణం

66-

*1698-(డబ్ల్యూ)- శ్రీ డి.ఎస్. రెడ్యానాయక్ :- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) 1990-91 సంవత్సరంలో గిరిజనుల కోసం కొత్త వసతి గృహ భవనాలను నిర్మించడానికి, కొత్త ఆవాస పాఠశాలలోను ప్రారంభించడానికి ఏదయినా ప్రతిపాదన వున్నదా ?

(ఆ) డోర్నకల్ నియోజకవర్గంలో గిరిజనుల కోసం ఆవాస పాఠశాలను, వసతి గృహ భవనాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదయినా వున్నది ?

(ఇ) వరంగల్ జిల్లాలోని గిరిజన వసతి గృహాలలో చాలా వాటికి విద్యుచ్ఛక్తి లేదన్న విషయం వాస్తవమేనా, అయినచో, సదరు వసతి గృహాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసేందుకు ఇంతవరకు తీసుకున్న చర్యలెవ్వి ?

(అ) 1990-91లో షెడ్యూలు తెగలవారి కోసం అయిదు నైవాసిక పాఠశాలలు ప్రారంభించే ప్రతిపాదన ఉంది. అయితే ప్రస్తుత సంవత్సరంలో క్రొత్త హాస్టలు భవనాలు నిర్మించే ప్రతిపాదన ఏవీ లేవు

(ఆ) లేదండీ.

(ఇ) వాస్తవం కాదండి.

ప్రపంచ పటము కొనుగోలును గూర్చిన విచారణ

67-

*2358- సర్వశ్రీ ఎం. ఓంకార్, ఎన్. చంద్రబాబునాయుడు, ఎల్.వి. డుక్కు :- సెకండరీ విద్య, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) సాంఘిక సంక్షేమ శాఖ వారు మద్రాసులోని కంపెనీ నుండి ప్రపంచ పటము (అట్లాస్)ను కొనుగోలు చేయుటలో జరిగిన అక్రమాల పరిశీలనను విచారణల సంఘ కమీషనరుకు అప్పగించినారా, అయినచో అందుపై కమిషన్ కనుగొన్న విషయాలేవి :

(ఆ) దానికి బాధ్యుడైన అధికారిపై తీసికొన్న చర్య ఏమి?

(అ) అవునండీ. ఈ విషయాన్ని విచారణ సంఘాల కమిషనరుకు అప్పగించడమయింది. ఆయన నివేదిక అందవలసి ఉంది.

(ఆ) విచారణ సంఘాల కమిషనరు నుంచి విచారణ నివేదిక అందిన వెంటనే చర్య తీసుకోవడం జరుగుతుంది.

అల్పసంఖ్యాక వర్గాల గృహనిర్మాణ సంస్థచే గుంటూరులో వక్ఫు ఆస్థుల అమ్మకము

68-

*2240 శ్రీ సిహెచ్. జయరాంబాబు :- వక్ఫులు, ఉర్దూ అకాడమీ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) శ్రీ వాహబ్ అనే వ్యక్తి అల్ప సంఖ్యాక వర్గాల గృహ నిర్మాణ సంస్థను స్థాపించి, గుంటూరులోని వక్ఫు ఆస్థిని అమ్మడానికి ప్రజల నుండి లక్షలాది రూపాయలను వసూలు చేసిన విషయం వాస్తవమేనా :

(ఆ) సదరు అమ్మకంలో వక్ఫు ఆస్థులు కూడా చేర్చబడినవా :

(ఇ) అయినచో, అతనిపై తీసుకున్న చర్య ఏమి ?

(అ) లేదండి. అటువంటి సమాచారము ప్రభుత్వ దృష్టికి రాలేదు.

(ఆ) లేదండి. రాష్ట్ర వక్ఫుబోర్డు వక్ఫు ఆస్తులను అమ్ముటకు ఎటువంటి అనుమతి యిచ్చియుండలేదు.

(ఇ) ఉత్పన్నము కాదు.

పాలవెల్లువ కార్యక్రమపు 1వ దశ నుండి 3వ దశ వరకు మినహాయించిన జిల్లాలు

69 -

*1694 - సర్వశ్రీ పి. వాగేశ్వరరావు, మహమ్మద్ రజాబ్ అలి, సి. విఠల్ రెడ్డి, కె. బిక్షం, జి. యాదగిరి రెడ్డి, ఎస్. వేణుగోపాలచారి:- పాడిపరిశ్రమాభివృద్ధి శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) పాల వెల్లువ కార్యక్రమ పథకపు 1వ దశ నుండి 3వ దశ వరకు మినహాయించిన జిల్లాల పేర్లెవ్వి ;

(ఆ) సదరు జిల్లాలోని పాడి పరిశ్రమాభివృద్ధిని ప్రభుత్వం ఏ విధంగా సాధించనున్నది?

(అ) పాలవెల్లువ కార్యక్రమం ప్రాజక్టు ప్రాంతం నుండి ఆరు జిల్లాలను అంటే వరంగల్లు, కరీంనగరు, ఖమ్మం, మహబూబ్‌నగర్, అనంతపురం, ఆదిలాబాదు జిల్లాలను మినహాయించడమయింది.

(ఆ) పై ఆరు జిల్లాలకు గాను మూడు జిల్లాలో అంటే వరంగల్లు, కరీంనగరు, ఖమ్మం జిల్లాల్లో జాతీయ సహకారం అభివృద్ధి సంస్థ (ఎన్‌సిడిసి) సహాయం పొందే ఏకీకృత పాడిపరిశ్రమ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. ప్రభుత్వం అంగీకారాన్ని తెలియపరిచింది. అయిదు సంవత్సరాల కాలంలో ఈ ప్రాజక్టు మొత్తం వ్యయం రూ. 10.50 కోట్లు. రాష్ట్ర ప్రభుత్వం వార్షిక ప్రణాళికల క్రింద సమాకూర్చే నిధుల ద్వారా మిగిలిన మూడు జిల్లాలో ఈ పథకం వర్తింప చేయడమవుతుంది.

రేపల్లె మార్కెట్ కమిటీలో నిధుల దుర్వినియోగం

70-

*1702- సర్వశ్రీ ఎ. శాంబాబు, కె.వి. నర్సిరెడ్డి :- మార్కెటింగ్ శాఖ మంత్రి దయచేసి ఈ క్రింది విషయములు తెలిపెదరా :

(అ) రేపల్లె వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అసిస్టెంట్ సూపర్ వైజరు శ్రీ రాజారావు, తాను వసూలు చేసిన మార్కెటింగ్ ఫీజులను రేపల్లె వ్యవసాయ మార్కెటింగ్ కమిటీకి జమ చేయకుండా, 1981-82 సంవత్సరం నుండి 1989 జూన్ వరకు గల కాలంలో రూ. 18 లక్షల మేరకు దుర్వినియోగం చేసిన విషయం వాస్తవమేనా ;

(ఆ) లోకల్ ఫండ్ ఆడిట్ అధికారులు కూడా లెక్కలను సక్రమంగా తనిఖీ చేయకుండా ధృవపత్రాన్ని యిచ్చిన విషయం కూడా వాస్తవమేనా :

(ఇ) అయినచో, ఆ అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్‌పైన, తప్పుడు ధృవపత్రాన్నిచ్చిన లోకల్‌ఫండ్ అధికారులపైన తీసుకున్న చర్య ఏమిటి?

(అ) అవునండీ. రేపల్లె వ్యవసాయ మార్కెటు కమిటీ అసిస్టెంటు మార్కెటు సూపర్‌వైజరు శ్రీ వి. రాజారావు, ఎల్.డి.సి. శ్రీ కె. వెంకటరావు రూ. 12.01 లక్షల మార్కెటు రుసుము వసూళ్ల మొత్తాన్ని దుర్వినియోగ పరచారు.

(ఆ) అవునండీ. లోకల్‌ఫండ్ ఆడిటు శాఖ ప్రతి సంవత్సరం లెక్కలను ఆడిట్ చేసినప్పటికీ ఆ శాఖ ఆడిటు నివేదికలలో దుర్వినియోగాలు జరిగినట్లు పేర్కొనలేదు.

(ఇ) అసిస్టెంటు మార్కెటు సూపరువైజరును, ఎల్.డి.సి.ని సస్పెన్షనులో ఉంచడమయింది. కాని అసిస్టెంటు మార్కెటు సూపరువైజరు ఆంధ్రప్రదేశ్ పరిపాలక ట్రిబ్యునలు నుంచి స్టే ఉత్తర్వులు పొందారు సంబంధిత ఆడిటర్లపై చర్య తీసుకోవలసిందిగా లోకల్ ఫండు ఆడిటు డైరెక్టరును కోరడమయింది. ఆయన నివేదిక అందవలసి ఉంది.